

ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 29-09-2026 | సంపుటి - 31 | సంచిక - 127 | రూ : 4 | పేజీలు: 8

సైమన్ గో బ్యాక్‌లా.. 'సర్' గోబ్యాక్

- దేశమంతా ఒక్కటై తిరుగుబాటు చేయడం ఖాయం
- 20 కోట్ల ఓట్లను తొలగించాలన్నది మోదీ లక్ష్యం
- మైనార్టీలను అణచివేసిన ప్రతిచోటా విప్లవం వస్తుంది
- ఏబీవీపీ కార్యకర్తగా డీలిమిటేషన్ వద్దని చెబుతున్నా..
- సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరిక



దిల్లీ: భారతీయులపై పెత్తనం చేయడానికి బ్రిటిషర్లు ఏర్పాటు చేసిన సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా దేశమంతా ఒక్కటై ఉద్యమించినట్లుగా **తరువాయి 2లో**



భూ సమస్యలన్నింటికీ
రీ-సర్వేతో పరిష్కారం




ఆ ఓటర్ల ఇళ్లకు
బీఎల్‌వోలు వెళ్లాల్సిందే

- నోటీసులు అందుకున్న వారి గుర్తింపు పత్రాలు సేకరించాలి
- డీఈవోలు, ఈఆర్వోలకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు

హైదరాబాద్: ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో నోటీసులు అందుకున్న ఓటర్లకు ఉపశమనం కలగనుంది. ఆ ఓటర్లు ఇకపై ఈఆర్వో కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదు. బీఎల్‌వోలే వారి వద్దకు వెళ్లి.. అవసరమైన గుర్తింపు పత్రాలను సేకరించాలి. ఈ పత్రాలను ఈసీఐ.నెట్‌లో అప్‌లోడ్ చేయాలి. వీటిని ఈఆర్వో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి. అసాధారణ పరిస్థితులుంటేనే ఆ ఓటరు గురించి విచారణ జరపాలి. వీలైతే ఆన్‌లైన్‌లోనే ఈ విచారణ నిర్వహించాలి. నోటీసు అందుకున్న ఓటరు **తరువాయి 2లో**

సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్
అక్టోబర్ 15 నుంచి యూపీఐ ఛార్జీలు

- యూపీఐ లావాదేవీలపై 0.4% ఛార్జీల విధింపుపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ
- అక్టోబర్ 15 నుంచి కొత్త నిబంధనల అమలుకు మార్గం సుగమం
- రూ.2,000 దాటిన మర్చంట్ చెల్లింపులపై మాత్రమే ఈ ఛార్జీ వర్తింపు
- సాధారణ, వ్యక్తిగత లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవని స్పష్టత
- ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలని కేంద్రం, ఆర్‌బీఐకి కోర్టు నోటీసులు



యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే నిర్దిష్ట లావాదేవీలపై 0.4% ఛార్జీలు విధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అక్టోబర్ 15 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో వాటిని నిలిపివేయాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై నేడు విచారణ చేపట్టింది. ఈ నిర్ణయంతో షెడ్యూల్ ప్రకారమే కొత్త ఛార్జీల అమలుకు మార్గం సుగమమైంది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం **తరువాయి 2లో**



నవంబర్ 1 నుంచి
ఢిల్లీలో కాలుష్య ఆంక్షలు

- ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణకు ముందస్తు చర్యలు
- నవంబర్ 1 నుంచి రెట్టింపు కానున్న పార్కింగ్ ఛార్జీలు
- ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలు
- నిర్మాణ, కూల్చివేత పనులపై పూర్తిగా నిషేధం
- ఫిబ్రవరి 28 వరకు అమలులో ఉండనున్న నిబంధనలు

ఢిల్లీ : ప్రతి ఏటా శీతాకాలంలో తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వం ముందస్తు నియంత్రణ చర్యలకు ఉపక్రమించింది. కాలుష్య తీవ్రతను తగ్గించే లక్ష్యంతో 2026 నవంబర్ 1వ తేదీ నుంచి కఠిన నిబంధనలను అమలు చేయనున్నట్లు **తరువాయి 2లో**

హెచ్-1బీపై కొత్త రూల్స్..
క్లారిటీ ఇచ్చిన జేడీ వాన్స్

- అమెరికన్ల స్థానంలో తక్కువ జీతాలకు విదేశీయులను నియమించుకోకూడదని స్పష్టీకరణ
- అత్యంత నైపుణ్యం కలిగిన వారితోనే అమెరికా ఆర్థిక వ్యవస్థ బలపడాలని వ్యాఖ్య
- ఉద్యోగులను తొలగించే కంపెనీలు హెచ్-1బీ వీసాలు పొందకుండా చర్యలు
- కాంగ్రెస్‌లో మద్దతు లేనందునే ఫీజు వంటి పరిపాలనాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడి





మనుషులకు ప్రాణాంతకం..
కీలక గడ్డిమందుపై కేంద్రం నిషేధం

- అత్యంత ప్రమాదకర పారాక్వాట్ డైక్లోరైడ్‌పై కేంద్రం నిషేధం
- మనుషులు, జంతువుల ఆరోగ్యానికి ప్రమాదకరమని వెల్లడి
- నిషేధ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం
- ఈ విషానికి విరుగుడు లేకపోవడమే ప్రధాన ఆందోళన


ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన కలుపు సంహారకాల్లో (హెర్బిసైడ్) ఒకటైన పారాక్వాట్ డైక్లోరైడ్‌పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. మానవులు, మూగజీవాల ఆరోగ్యానికి ఇది తీవ్ర ముప్పుగా పరిణమిస్తోందని నిపుణుల కమిటీ నిర్ధారించడంతో ఈ కీలక నిర్ణయం వెలువడింది. ఈ మేరకు జారీ చేసిన నోటిఫి **తరువాయి 2లో**

ఫుడ్ లేబుల్స్ ఆలస్యం
FSSAIపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- ఫుడ్ లేబులింగ్ విధానంలో జాప్యంపై ఎఫ్ఎస్ఎస్ఏకి సుప్రీంకోర్టు అక్షింతలు
- ఇది ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన విషయమన్న అత్యున్నత న్యాయస్థానం
- ప్యాకెట్ల ముందు భాగంలో హెచ్చరికలు జారీ చేసే కొత్త విధానంపై విచారణ **2లో**
- 'అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్'కు స్పష్టమైన నిర్వచనం ఇవ్వాలని ఆదేశం

నెట్ వాడకంలో రికార్డు
పెరిగిన బ్రాడ్‌బ్యాండ్ యూజర్లు

- దేశవ్యాప్తంగా 110 కోట్లు దాటిన బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య
- ఆగస్టు నెలలో 0.61 శాతం వృద్ధిని నమోదు చేసిన టెలికం రంగం
- ఒక్క నెలలోనే 1.58 కోట్ల మంది మొబైల్ నంబర్ పోర్టబిలిటీకి దరఖాస్తు
- డిజిటల్ కనెక్టివిటీకి రేటింగ్ ఇచ్చేందుకు ట్రాయ్ నుంచి కొత్త ప్లాట్‌ఫామ్ ప్రారంభం



భారతదేశ టెలికం రంగం మరోసారి వృద్ధి పథంలో దూసుకెళ్లింది. ఆగస్టు నెలలో బ్రాడ్‌బ్యాండ్, వైర్‌లైన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) సోమవారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా డిజిటల్ సేవలు విస్తరిస్తున్నాయనడానికి ఈ సంఖ్యలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ట్రాయ్ నివేదిక ప్రకారం, ఆగస్టు 2026 చివరి నాటికి **తరువాయి 2లో**

భూ సమస్యలన్నింటికీ రీ-సర్వేతో పరిష్కారం

*** రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి**

నాగర్‌కర్నూల్: రాష్ట్రంలోని భూసమస్యలన్నింటికీ రీసర్వేనే పరిష్కారమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలతోపాటు నక్షాలు లేని మరో 413 గ్రామాల్లోనూ రీసర్వే జరుగుతున్నట్లు వెల్లడించారు. సోమవారం భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు, రీసర్వే అంశాలపై మంత్రులు కృష్ణారావు, శ్రీహరితో కలసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో వనపర్తి కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. భూభారతి చట్టంలో చెప్పినట్లుగా ప్రతి ఒక్కరికీ ఆధార్ ఎలా ఉందో.. ఎల్‌పీఎం నంబర్లతో కూడిన భూధార్‌కార్డును భూములున్న అందరికీ ఇస్తామన్నారు. రీసర్వే ద్వారా ఏళ్ల తర్వాత తమ భూములకు పరిష్కారం లభిస్తుందనే స్పందన రైతుల నుంచి వస్తోందన్నారు. సర్వేకు సుమారు 1,400 వరకు అధునాతన రోవర్లను ప్రతి జిల్లాకు ఇచ్చామని చెప్పారు. 5,558 మంది సర్వేయర్లకు లైసెన్సులు ఇవ్వడమే కాకుండా మెరుగైన వేతనం చెల్లించి వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఏళ్లుగా సాగులో ఉండి, సరైన టైటిల్ లేకుండా ఉన్న రైతుల సమస్యలు పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా.. 2 లక్షలు పూర్తయ్యాయన్నారు. రెండో విడతలో భాగంగా గతంలో అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసుకునేలా ప్రతి నియోజకవర్గానికి 500 గృహాలు ఇస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజేశ్‌రెడ్డి, నారాయణరెడ్డి, వంశీకృష్ణారెడ్డి, అనిరుధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 1 నుంచి ఢిల్లీలో కాలుష్య ఆంక్షలు

ప్రతి ఏటా శీతాకాలంలో తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వం ముందస్తు నియంత్రణ చర్యలకు ఉపక్రమించింది. కాలుష్య తీవ్రతను తగ్గించే లక్ష్యంతో 2026 నవంబర్ 1వ తేదీ నుంచి కఠిన నిబంధనలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా పార్కింగ్ ఛార్జీలను రెట్టింపు చేయడంతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త నిబంధనల ప్రకారం, నవంబర్ 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు కేవలం 50 శాతం సిబ్బందితోనే కార్యకలాపాలు సాగించాలి. మిగిలిన 50 శాతం మంది ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వెసులుబాటు కల్పించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు, నగర వ్యాప్తంగా భవన నిర్మాణ, కూల్చివేత పనులపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. వాహనాల వినియోగాన్ని నియంత్రించేందుకు ఈ కాలంలో పార్కింగ్ ఫీజులను కూడా రెట్టింపు చేయనున్నట్లు వెల్లడించింది. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాలలో పంట వ్యర్థాలను కాల్చడం, వాహన కాలుష్యం, నిర్మాణ రంగ ధూళి, దీపావళి బాణసంచా, పారిశ్రామిక ఉద్గారాల వంటి కారణాలతో ఢిల్లీ నగరం ప్రతి ఏటా గ్యాస్ ఛాంబర్‌ను తలపిస్తోంది. దట్టమైన పొగమంచు కారణంగా ప్రజలు శ్వాసకోశ సమస్యలు బారిన పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ చర్యల ద్వారా శీతాకాలంలో కాలుష్య తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

ఫుడ్ లేబుల్స్ ఆలస్యం FSSAIపై సుప్రీంకోర్టు ఆగ్రహం

ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలపై 'ఫ్రంట్ ఆఫ్ ప్యాక్ లేబులింగ్' (FoPL) విధానం అమలులో జరుగుతున్న జాప్యంపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI)పై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇది ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అత్యంత కీలకమైన అంశమని, దీని అమలులో ఇంత జాప్యం తగదని స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించి ఎఫ్ఎస్ఎస్ఏఐ దాఖలు చేసిన అఫిడవిట్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, తన తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. విచారణ సందర్భంగా జస్టిస్‌లు ఎఫ్ఎస్ఎస్ఏఐ వైఖరిని ప్రశ్నించారు. "ఇది ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సున్నితమైన అంశం. దీన్ని అమలు చేయడానికి మీకెందుకు ఇంత సమయం పడుతోంది? సమయాన్ని ఎందుకు వృధా చేయాలనుకుంటున్నారు? దీనిపై మాకు ఆందోళనగా ఉంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అంతేకాకుండా, "అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్"కు స్పష్టమైన, కచ్చితమైన నిర్వచనం ఉండాలని ఆదేశించింది. ఈ కేసులో సంబంధిత పక్షాలన్నీ మూడు రోజుల్లోగా తమ లిఖితపూర్వక వాదనలు సమర్పించాలని ఆదేశిస్తూ తీర్పును రిజర్వ్ చేసింది.

ఏమిటీ ఫ్రంట్ ఆఫ్ ప్యాక్ లేబులింగ్?

ప్రస్తుతం, ఆహార ప్యాకెట్ల వెనుక భాగంలో పోషకాలకు సంబంధించిన సమాచార పట్టిక ఉంటుంది. అయితే, ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రతిపాదించిన కొత్త విధానం ప్రకారం, నిర్దిష్ట పరిమితికి మించి అదనపు చక్కెర (షుగర్), కొవ్వు (ఫ్యాట్) లేదా ఉప్పు (సాల్ట్) ఉన్న ప్యాకేజ్డ్ ఫుడ్స్‌పై ముందు భాగంలోనే స్పష్టంగా కనిపించేలా ఒక హెచ్చరిక ఉంటుంది. ఈ హెచ్చరికను ప్యాకెట్ ముందు భాగంలో, ఎగువన ఎడమ వైపున, తెల్లటి చతురస్రంలో ఎర్రటి షడ్భుజి (hexagon) గుర్తుతో ముద్రిస్తారు. ఏ పోషకం పరిమితికి మించి ఉందో దాని పేరును ఆ గుర్తు లోపల పేర్కొంటారు. ఒకటి కంటే ఎక్కువ పోషకాలు అధికంగా ఉంటే, అన్నింటి పేర్లను అదే హెచ్చరిక గుర్తులో చూపిస్తారు. కేవలం ప్రాసెస్ చేసిన ఆహారం అని వర్గీకరించకుండా, అందులోని పోషకాల స్థాయిల ఆధారంగా ఈ హెచ్చరిక జారీ చేయడం ఈ విధానం ప్రత్యేకత. శీతల పానీయాల విషయంలో కూడా చక్కెర లేదా ఉప్పు పరిమితి దాటితే ఈ హెచ్చరిక తప్పనిసరి అవుతుంది. వినియోగదారులు ఒక వస్తువును కొనుగోలు చేసే సమయంలోనే ప్యాకెట్‌పై ఉన్న హెచ్చరికను చూసి, ఆరోగ్యకరమైన నిర్ణయం తీసుకోవడానికి ఈ ఫ్రంట్ ఆఫ్ ప్యాక్ లేబుల్స్ ఎంతగానో ఉపయోగపడతాయి. అందుకే ప్రజారోగ్యం దృష్ట్యా ఈ అంశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

నెట్ వాడకంలో రికార్డు పెరిగిన బ్రాడ్‌బ్యాండ్ యూజర్లు

భారతదేశ టెలికం రంగం మరోసారి వృద్ధి పథంలో దూసుకెళ్లింది. ఆగస్టు నెలలో బ్రాడ్‌బ్యాండ్, వైర్‌లైన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) సోమవారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా డిజిటల్ సేవలు విస్తరిస్తున్నాయనడానికి ఈ సంఖ్యలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ట్రాయ్ నివేదిక ప్రకారం, ఆగస్టు 2026 చివరి నాటికి దేశంలో బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1,101.21 మిలియన్లకు (సుమారు 110.12 కోట్లు) చేరింది. జులై నెలలో ఈ సంఖ్య 1,094.48 మిలియన్లుగా ఉండగా, కేవలం ఒక్క నెలలోనే 0.61 శాతం వృద్ధి నమోదైంది. ఇదే సమయంలో, యాక్టివ్ వైర్‌లెస్ (మొబైల్) సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1,207.59 మిలియన్లుగా (120.75 కోట్లు) ఉన్నట్లు తేలింది. కాగా, ఆగస్టు నెలలో ఏకంగా 15.83 మిలియన్ల (1.58 కోట్లు) మంది తమ మొబైల్ నెట్‌వర్క్‌ను మార్చుకునేందుకు మొబైల్ నంబర్ పోర్టబిలిటీ (MNP) కోసం దరఖాస్తు చేసుకోవడం విశేషం. మరోవైపు, వైర్‌లైన్ (ల్యాండ్‌లైన్) కనెక్షన్ల సంఖ్య కూడా పెరిగింది. జులై చివరికి 48.01 మిలియన్లుగా ఉన్న ఈ సంఖ్య, ఆగస్టు చివరి నాటికి 48.45 మిలియన్లకు చేరింది. నెలవారీగా 0.93 శాతం పెరుగుదల కనిపించింది. వైర్‌లైన్ కనెక్షన్లలో పట్టణ ప్రాంతాల వాటా 89.08 శాతంగా ఉండగా, గ్రామీణ ప్రాంతాల వాటా 10.92 శాతంగా ఉంది. ప్రభుత్వ రంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్, ఏపీఎస్ఎఫ్ఎల్ కలిసి వైర్‌లైన్ మార్కెట్‌లో 16.05 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇదిలా ఉండగా, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో ట్రాయ్ ఇటీవల ఒక కీలక ముందడుగు వేసింది. ఇళ్లు, కార్యాలయాలు వంటి భవనాల్లో డిజిటల్ కనెక్టివిటీ నాణ్యతను తెలుసుకునేందుకు 'డిజిటల్ కనెక్టివిటీ రేటింగ్ (DCR)' పేరుతో ఒక కొత్త ప్లాట్‌ఫామ్‌ను, మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా వినియోగదారులు తాము కొనుగోలు చేయాలనుకుంటున్న లేదా అద్దెకు తీసుకోవాలనుకుంటున్న భవనాల్లో ఇంటర్నెట్, మొబైల్ సిగ్నల్ నాణ్యత ఎలా ఉందో ముందుగానే తనిఖీ చేయవచ్చు. "ఈ రేటింగ్స్ వల్ల వినియోగదారులు సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకునేందుకు వీలు కలుగుతుంది. నాణ్యమైన కనెక్టివిటీ ఉన్న ఇళ్లు, ఆఫీసులను ఎంచుకోవడానికి ఇది ఎంతగానో సహాయపడుతుంది" అని ట్రాయ్ చైర్మన్ అనిల్ కుమార్ లహోటి వివరించారు.

హెచ్-1బీపై కొత్త రూల్స్.. క్లారిటీ ఇచ్చిన జేడీ వాన్స్

హెచ్1బీ వీసా వ్యవస్థపై అమెరికా ప్రభుత్వం తన కఠిన వైఖరిని కొనసాగిస్తోంది. కొన్ని హెచ్ 1బీ వీసా దరఖాస్తులపై 100,000 డాలర్ల (సుమారు రూ.95లక్షలు) భారీ ఫీజు విధించాలన్న తమ యంత్రాంగం నిర్ణయాన్ని యూఎస్ వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ గట్టిగా సమర్థించుకున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా మేలు చేసే అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులను ఆకర్షించేందుకే హెచ్ 1బీ వీసా ప్రోగ్రామ్ ఉండాలని, అంతేగానీ అమెరికన్ ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో తక్కువ జీతాలకు విదేశీయులను నియమించుకోవడానికి కాదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల 'ఆల్ ఇన్ పాడ్‌కాస్ట్'లో మాట్లాడిన జేడీ వాన్స్.. హెచ్ 1బీ వీసాల వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని వివరించారు. "తక్కువ జీతాలకు పనిచేసే విదేశీయులతో అమెరికన్లను భర్తీ చేయడానికి హెచ్ 1బీ వీసా విధానం లేదు. అమెరికా ఆర్థిక వ్యవస్థను సుసంపన్నం చేయడానికి మాత్రమే ఇది ఉపయోగపడాలి" అని ఆయన అన్నారు. టెక్నాలజీ రంగంలో లేదా ఇతర కీలక రంగాలలో గణనీయమైన మార్పు తీసుకురాగల నిపుణులను కంపెనీలు ఆహ్వానించాలని ఆయన సూచించారు. ఈ విషయాన్ని ఆయన ఒక ఉదాహరణతో మరింత స్పష్టంగా వివరించారు. "ఉదాహరణకు, ఒక అమెరికన్ అకౌంటెంట్ ఏడాదికి 60,000 డాలర్ల జీతం తీసుకుంటుంటే, ఆ వ్యక్తిని తొలగించి అదే స్థానంలో ఒక విదేశీ ఉద్యోగిని 45,000 డాలర్లకే నియమించుకోవడం హెచ్ 1బీ వీసా అసలు లక్ష్యం కాదు" అని వాన్స్ తెలిపారు. ఇలాంటి పద్ధతులను అరికట్టడానికే కఠిన నిబంధనలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. హెచ్ 1బీ వీసా వ్యవస్థలో విస్తృతమైన చట్టపరమైన మార్పులు తీసుకురావడానికి అమెరికా కాంగ్రెస్‌లో రాజకీయ సంకల్పం తక్కువగా ఉందని, అందుకే తమ ప్రభుత్వం ఫీజుల పెంపు వంటి పరిపాలనాపరమైన చర్యలపై దృష్టి సారించిందని జేడీ వాన్స్ అంగీకరించారు. అంతేగాక పెద్ద ఎత్తున అమెరికన్ ఉద్యోగులను తొలగించిన కంపెనీలు, కార్మికుల కొరత ఉందని చెబుతూ మళ్లీ హెచ్ 1బీ వీసాల కోసం దరఖాస్తు చేయకుండా నిరోధించే మార్గాలను కూడా తమ యంత్రాంగం పరిశీలిస్తోందని ఆయన వెల్లడించారు. హెచ్ 1బీ వీసా వ్యవస్థను కఠినతరం చేసేందుకు జరుగుతున్న సంస్కరణల చర్చల నేపథ్యంలో వాన్స్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్.. అక్టోబర్ 15 నుంచి యూపీఐ ఛార్జీలు

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే నిర్దిష్ట లావాదేవీలపై 0.4% ఛార్జీలు విధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అక్టోబర్ 15 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో వాటిని నిలిపివేయాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై నేడు విచారణ చేపట్టింది. ఈ నిర్ణయంతో షెడ్యూల్ ప్రకారమే కొత్త ఛార్జీల అమలుకు మార్గం సుగమమైంది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సహా ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ముఖ్యంగా ఈ కొత్త ఛార్జీల విధింపునకు గల ప్రాతిపదికను వివరిస్తూ అఫిడవిట్ సమర్పించాలని కేంద్రాన్ని కోరింది.

*** కొత్త నిబంధనల ప్రకారం ఛార్జీల స్వరూపం**

సెప్టెంబర్‌లో జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం, వ్యక్తుల నుంచి వ్యాపారులకు (పీ2పీ) చేసే రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై 0.4% 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) వర్తిస్తుంది. రూ.75,000, ఆపైబడిన లావాదేవీలకు గరిష్ఠంగా రూ.300 ఛార్జీ ఉంటుంది. అయితే, ఈ ఛార్జీల ప్రభావం సాధారణ వినియోగదారులపై ఎక్కువగా ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

*** ఎవరికి మినహాయింపు?**

> వ్యక్తుల మధ్య (పీ2పీ) జరిగే యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు.
> వ్యాపారులకు చేసే రూ.2,000 లోపు చెల్లింపులు పూర్తిగా ఉచితం.
> యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు సున్నా ఎండీఆర్ నిబంధన వర్తిస్తుంది.
> అత్యవసర సేవలకు ఫ్లాట్‌గా రూ.5, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు 0.02% చొప్పున తక్కువ ఛార్జీలు వర్తిస్తాయి.

*** ఇది పన్ను కాదు, సెటిల్‌మెంట్ ఫీజు: కేంద్రం**

కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపిస్తూ, ఈ కొత్త ఛార్జీల వల్ల దాదాపు 96% మర్చంట్ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే పన్ను కాదని, కేవలం పేమెంట్ సిస్టమ్‌లో భాగమైన ఒక సెటిల్‌మెంట్ ఫీజు మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ ఛార్జీలు నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేయరని ఆయన వివరించారు. ప్రస్తుతం స్టే ఇచ్చేందుకు నిరాకరించినప్పటికీ, కేంద్రం ఇచ్చే వివరణ అనంతరం సుప్రీంకోర్టు ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోనుంది.

మనుషులకు ప్రాణాంతకం.. కీలక గడ్డిమందుపై కేంద్రం నిషేధం

ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన కలుపు సంహారకాల్లో (హెర్బిసైడ్) ఒకటైన పారాక్వాట్ డైక్లోరైడ్‌పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. మానవులు, మూగజీవాల ఆరోగ్యానికి ఇది తీవ్ర ముప్పుగా పరిణమిస్తోందని నిపుణుల కమిటీ నిర్ధారించడంతో ఈ కీలక నిర్ణయం వెలువడింది. ఈ మేరకు జారీ చేసిన నోటిఫికేషన్ తక్షణమే అమల్లోకి వస్తుందని కేంద్రం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో పారాక్వాట్‌ను నియంత్రించిన సుమారు 70 దేశాల జాబితాలో భారత్ కూడా చేరినట్లయింది. ఇన్సెక్టిసైడ్స్ యాక్ట్, 1968 నిబంధనల ప్రకారం, నిపుణుల కమిటీ, రిజిస్ట్రేషన్ కమిటీల సిఫార్సుల మేరకు ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాజా ఆదేశాల ప్రకారం పారాక్వాట్ డైక్లోరైడ్‌కు సంబంధించిన కొత్త రిజిస్ట్రేషన్లను తక్షణమే నిలిపివేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను కూడా రద్దు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. సదరు సర్టిఫికెట్లను వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని, ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నిషేధాజ్ఞలను పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేసింది.

ఎందుకీ నిషేధం?

పారాక్వాట్ డైక్లోరైడ్ అత్యంత విషపూరితమైన రసాయనం. దీనిని స్వల్ప మోతాదులో తీసుకున్నా ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంది. దీనికి నిర్దిష్టమైన విరుగుడు లేకపోవడం వైద్య రంగంలో పెను ఆందోళన కలిగించే అంశం. ఈ రసాయనం ప్రధానంగా ఊపిరితిత్తులు, మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం చూపి, 'పల్మనరీ ఫైబ్రోసిస్' వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తుంది. ఈ కలుపు సంహారకంపై నిషేధం విధించాలని శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు, పర్యావరణవేత్తలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం, దేశంలో 2024లో పురుగుల మందుల కారణంగా సుమారు 34,000 మంది మరణించారు (వీటిలో ఆత్మహత్యలు, ప్రమాదవశాత్తు జరిగిన మరణాలు ఉన్నాయి). ఈ తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం, ప్రజారోగ్య ప్రయోజనాల దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

ఆ ఓటర్ల ఇళ్లకు బీఎల్‌వోలు వెళ్లాల్సిందే..

హైదరాబాద్: ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో నోటీసులు అందుకున్న ఓటర్లకు ఉపశమనం కలగనుంది. ఆ ఓటర్లు ఇకపై ఈఆర్వో కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదు. బీఎల్‌వోలే వారి వద్దకు వెళ్లి.. అవసరమైన గుర్తింపు పత్రాలను సేకరించాలి. ఈ పత్రాలను ఈసీఐ.నెట్‌లో అప్‌లోడ్ చేయాలి. వీటిని ఈఆర్వో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి. అసాధారణ పరిస్థితులుంటేనే ఆ ఓటరు గురించి విచారణ జరపాలి. వీలైతే ఆన్‌లైన్‌లోనే ఈ విచారణ నిర్వహించాలి. నోటీసు అందుకున్న ఓటరు తరఫున అవసరమైతే.. ఆ కుటుంబంలో 18 సంవత్సరాలు నిండిన ఎవరైనా విచారణకు హాజరు కావొచ్చు. ఈ మేరకు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ కార్యాలయం (సీఈవో) సోమవారం కొత్త మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను జారీ చేసింది. చాలా మంది ఓటర్లు విచారణకు హాజరు కాకపోతుండడంతో బీఎల్‌వోలే వారి ఇళ్ల వద్దకు వెళ్లి 'సర్' నోటీసులను పరిష్కరించాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కొత్తగా నోటీసులు అందుకునే వారు, నోటీసులు వచ్చినా.. విచారణకు హాజరు కాని వారు కలిపి రాష్ట్రంలో 33.91 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పుడు వీరందరి ఇళ్లకు బీఎల్‌వోలు వెళ్లాల్సిందే.

సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

నిరాశ్రయ కేంద్రాల్లో నివసించే ప్రజలు, కూలీలు, కార్మికులు, పేదలు, ఇతర పనుల మీద ఆధారపడి జీవిస్తున్న వారికోసం.. సహాయ కేంద్రాలు / ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. కొత్త ఓటరుగా నమోదుచేసుకునేందుకు సమర్పించాల్సిన ఫారం 6పైన కూడా స్పష్టత ఇచ్చారు. 'సర్' ప్రక్రియకు సంబంధించిన కాలమ్‌లో కాకుండా సాధారణ కాలమ్‌లో అందించే దరఖాస్తులకు 1950నాటి ఎన్నికల రిజిస్ట్రేషన్ నిబంధనలు వరిస్తాయని వెల్లడించింది. ఈ ఏడాది అక్టోబరు 1వ తేదీ నాటికి 18ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ కొత్త ఓటరుగా నమోదుకు అర్హులని వెల్లడించింది. వీరూ ఫారం 6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.



రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో వసతులు మెరుగుపరచాలి

*** ఆహారం, పారిశుద్ధ్యం, భద్రతపై నిరంతర పర్యవేక్షణ : సీఎస్ సంజయ్ జాజు**



జనగామ, ప్రజాస్ఫూర్తి: రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు వారి ఆరోగ్యం, భద్రత, విద్య, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణపై సమీక్షించారు. జనగామ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ కలెక్టర్లు రెసిడెన్షియల్ విద్యాసంస్థలను క్రమం తప్పకుండా ఆకస్మికంగా తనిఖీ చేసి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలన్నారు. రానున్న చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు వెచ్చని నీరు, అవసరమైన దుప్పట్లు ముందుగానే అందుబాటులో ఉంచాలని తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న విద్యాసంస్థల్లో అవసరమైన మరమ్మతులు, మార్పులు చేపట్టేలా భవన యజమానులతో సమన్వయం చేయాలని సూచించారు. దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన ఏకరూప దుస్తులు అందేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు కుట్టు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని, ఒత్తిడి, వ్యక్తిగత, భావోద్వేగ సమస్యలను గుర్తించి అవసరమైన కౌన్సెలింగ్ అందించాలని సూచించారు. అన్ని విద్యాసంస్థల్లో ఎఫ్ఆర్ఎస్ హాజరు తప్పనిసరిగా అమలు చేయాలని, సిబ్బంది సమయపాలన, విధుల నిర్వహణపై పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. విద్యాసంస్థల వివరాలు, లోపాలు, పరిష్కార చర్యలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సంక్షేమ, గురుకుల, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఎఫ్ఆర్ఎస్ హాజరు తప్పనిసరిగా నమోదు కావాలని ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రత, ఆహార నాణ్యత, తాగునీరు, మరుగుదొడ్లు, బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రతిరోజూ తనిఖీ చేసేలా నోడల్ అధికారులను నియమించి, వంటగది, ఆహార నిల్వలు, తరగతి గదులు, హాస్టల్ గదుల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్, జీసీడీఓ గౌసియా బేగం, బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి హసీనా బేగం, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మురళీధర్ రావు, ఆహార భద్రత అధికారి వినీల్, డీసీఓ మాన్వీ చంద్, డీఎంహెచ్ఓ వాణిశ్రీ తదితర అధికారులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుందాం ఎల్లంకి మహేష్



వలిగొండ, ప్రజాస్ఫూర్తి: మండల కేంద్రంలో ఏఐటీయూసీ మండల సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ 119 వ జయంతినీ పురస్కరించుకొని భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఏఐటీయూసీ మండల అధ్యక్షులు కనకబోయిన ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయుసి మండల కార్యదర్శి ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ భగత్ సింగ్ ఈ దేశానికి సంపూర్ణమైన స్వాతంత్రం కావాలని, బ్రిటిష్ సామ్రాజ్యానీ వ్యతిరేకంగా పోరాడారని అతి చిన్న వయసులో ఉరికంబాన్ని ముద్దాడి తన తోపాటు రాజు గురు ,సుఖుదేవ్ లు ప్రాణాలను ఇచ్చారని అన్నారు. వారి స్ఫూర్తితో నేటి సమాజమంతా చైతన్య మవ్వాలని ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు పోలపాక యాదయ్య, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు మారోజు నరసింహ చారి, ఏఐటీయుసి సీనియర్ నాయకులు బోడిగ సుదర్శన్, మామిడికాయల నరేష్,ఇంజమూరి సాయిలు, ఎడవల్లి వేణు, శ్యామల నరేందర్,ఎక్కలదేవి విజయ్, యాట నరసింహా,సోమేశ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల చోరీ ఆరోపణలపై జ్ఞానేష్ కుమార్‌ను అరెస్టు చేయాలి

*** జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుల భారీ ధర్నా**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఏకపక్ష నిర్ణయాలు, అక్రమ మార్పులకు పాల్పడ్డారంటూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఆయనను తక్షణమే పదవి నుంచి తొలగించి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి ,ఎమ్మెల్సీ శంకర్ నాయక్ , ఎమ్మెల్యే మందుల సామేల్ ,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ , సీనియర్ కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు చేతబట్టి కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి మహా ధర్నా నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమగ్ర వివరణ ఇవ్వాలని, ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమం లో పెద్దసంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్ మరమ్మతులు చేపట్టాలి




భూపాలపల్లి, (ప్రజాస్ఫూర్తి): జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద గత ఏడు నెలలుగా ట్రాఫిక్ సిగ్నల్ పనిచేయకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీసీ సంఘం జిల్లా నాయకుడు, పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమనాథుని సత్యనారాయణ తెలిపారు. సిగ్నల్ పనిచేయకపోవడంతో ప్రమాదాల ముప్పు నెలకొందని పేర్కొన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి ట్రాఫిక్ సిగ్నల్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే మున్సిపల్ ఎన్నికలకు ముందు శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సత్యనారాయణ తెలిపారు.

ప్రజావాణి అర్జీలను గడువులోగా పరిష్కరించాలి



భూపాలపల్లి, (ప్రజాస్ఫూర్తి): ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి 81 దరఖాస్తులు స్వీకరించారు.అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసి, త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. వారం రోజుల్లోగా అర్జీలను పరిష్కరించి, తీసుకున్న చర్యల వివరాలను సంబంధిత పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రతి అర్జీని ప్రాధాన్యంగా పరిగణించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం



భువనగిరి, ప్రజాస్ఫూర్తి:అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య ,భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టి ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య ,భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో పౌరుల ఓటు హక్కును కాలరాస్తూ ఓట్ల చోరీ జరుగుతుందని లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన హెచ్చరికలు నేడు అక్షరాల నిజమని తేలాయి ఎస్ ఐ ఆర్ పేరుతో లక్షలాది ఓట్లను అక్రమంగా తొలగించిన తీరును స్వయంగా ఎన్నికల కమిషనర్లే అంగీకరించడం దేశ ప్రజాస్వామ్యానికే పెను ముప్పు అని అన్నారు.కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు .భారతదేశంలో 13 కోట్ల ఓట్లు తొలగింపు ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో 72 లక్షల ఓట్ల తొలగింపు జరిగిందని, కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఉన్న ఓట్లను తొలగింపు చేశారని ఆరోపించారు. ఓటు అనేది ప్రతి భారత పౌరుడి ప్రజాస్వామ్య హక్కు హక్కు ఎలాంటి భంగం కలగకూడదని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలను జరిగాయన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పారిదర్శకమైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తీసుకున్న నిర్ణయాలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తుందని, ఈ వ్యవహారంపై నైతిక బాధ్యత వయస్సు ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, పోత్నక్ ప్రమోద్ కుమార్, పడిగెల ప్రదీప్ ,ఆలేరు మాజీ ఎంపీపీ గంధమల్ల అశోక్ ,కాసగళ్ల చందు, మహిళా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు నీలం పద్మ ,రాచమల్ల రమేష్, బాబులు ,కౌసర్, కృష్ణారెడ్డి, డాకూరి ప్రకాష్ ,పిట్టల బాలరాజ్, వాజేద్, గుమ్మడి రమేష్, శ్యామల, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు క్రాస్ రోడ్‌లో పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలి



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: లక్ష్మీదేవిపల్లి మండలం ఇల్లందు క్రాస్‌రోడ్ వద్ద ప్రయాణీకుల సౌకర్యార్థం పబ్లిక్ టాయ్‌లెట్లను ఏర్పాటు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంజారా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ అంకిత్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ బానోత్ వీరు నాయక్ మాట్లాడుతూ లక్ష్మీదేవిపల్లి మండలం ఇల్లందు క్రాస్‌రోడ్ నేషనల్ హైవేను అనుసంధానం చేస్తూ ఉన్న అతిపెద్ద కూడలి అని, ప్రతిరోజు వేలాది మంది ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, టేకులపల్లి, ఇల్లందు, మహమూబాబాద్, వరంగల్, కొత్తగూడెం, ఖమ్మం వంటి ప్రాంతాలకు ఇల్లందు క్రాస్‌రోడ్ కేంద్ర బిందువుగా ఉందని, ఇల్లందు నుంచి పాల్వంచ వైపు మరియు పాల్వంచ నుంచి ఇల్లందు వైపునకు వెళ్లే ప్రయాణీకులు కొత్తగూడెం బస్టాండ్ వరకు రాకుండా ఇల్లందు క్రాస్‌రోడ్ వద్ద ఆర్టీసీ బస్సులు, ఆటోలను మారవలసి ఉంటుందన్నారు. క్రాస్‌రోడ్‌లో దిగి బస్సులు, ఆటోల కోసం ఎదురుచూసే క్రమంలో ప్రయాణీకులకు ప్రధానంగా మహిళలకు అవసరమైన టాయ్‌లెట్స్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రయాణీకులు, మహిళల సౌకర్యార్థం ప్రభుత్వ నిధులతో మరుగుదొడ్లు ఏర్పాటు చేసి నిర్వహణ చూడాలని బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ జేఏసీ, ఆటో యూనియన్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా నాయకులు గుగులోత్ కేశవ, బానోత్ రమేష్, గుగులోత్ భద్రు, ఇస్లావత్ అనిల్, ధరావత్ మురళి, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ నాని, భాస్కర్, కార్తీక్, అనిల్, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

*** 30 మందికి పైగా గంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక**



ప్రజాస్ఫూర్తి ,జన్నారం:లయన్స్ క్లబ్ ఆఫ్ జన్నారం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్లో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ రీజియన్ చైర్ పర్సన్ జక్కు భూమేష్ ఆధ్వర్యంలో పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ సహకారంతో శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ కస్తూరి సతీష్ కుమార్ మరియు లయన్స్ క్లబ్ సభ్యుల సమన్వయంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. వైద్య బృందం ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి శుక్లాలు తదితర సమస్యలను గుర్తించారు. పరీక్షల అనంతరం 30 మందికి పైగా అవసరమైన రోగులకు ఉచిత కంటి శస్త్ర చికిత్స కోసం కరీంనగర్ రేకుర్తి ఐ హాస్పిటల్ కు పంపించే ఏర్పాట్లు చేయడమే కాకుండా ఉచిత భోజనము వసతి సౌకర్యాలు కూడా కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రీజియన్ చైర్ పర్సన్ జక్కు భూమేష్ మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న పేద ప్రజలు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని,జన్నారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రీజియన్ సెక్రటరీ కస్తూరి సతీష్ కుమార్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బండారి మారుతి రాజ్, సెక్రెటరీ గోలి రాము, డిసి సభ్యులు అంజుత్ రావు, మల్యాల బాబు, నరేందుల గోపి, ఉపసర్పంచ్ అప్పాల జలపతి వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేటలో సీసీ రోడ్డు, అదనపు వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

హత్నూర, ప్రజాస్ఫూర్తి :సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నవాబుపేట గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, అదనపు వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేసినట్లు సర్పంచ్ ఎరుకల బుచ్చయ్య, ఉప సర్పంచ్ జక్కుల బాబయ్య తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు రైతుల సౌకర్యార్థం అదనపు వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు. తమ వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్, ఉప సర్పంచ్ తెలిపారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో మతోన్మాదం పైన యువత పోరాడాలి



వలిగొండ, ప్రజాస్ఫూర్తి: దేశంలో బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చ గొడుతూ చేస్తున్న మతోన్మాద రాజకీయాల పైన యువత ముందుకు వచ్చి పోరాడాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కవిడే సురేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు లు పిలుపునిచ్చారు.సోమవారం డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ ల ఆధ్వర్యంలో భగత్ సింగ్ 119 జయంతి కార్యక్రమం మండల కేంద్రంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళీలు అర్పించారు.ఈ సందర్భంగా సురేష్,నాగరాజు లు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అతి చిన్న వయస్సులోనే స్వాతంత్ర పోరాటంలో పాల్గొని విరోచితమైన పోరాటం చేసి ఆనాటి బ్రిటిష్ పార్లమెంటు పైన బాంబుతో దాడి చేసి ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మద్దెల రాజయ్య,సిరిపంగి స్వామి,కూర శ్రీను,కందడి సత్తిరెడ్డి,మొగిలిపాక గోపాల్. కల్కూరి రాంచందర్, ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు మైసోల్ల నరేందర్,ద్యానబోయిన యాదగిరి నాయకులు వడ్డెమన్ మధు,పెద్దబోయిన భీమరాజు,సలీగంజీ మురళి,మచ్చగిరి,కందుల మహేష్,శీలం ఇందిరా,కొండూరు సత్తయ్య,గంగాపురం వెంకటేష్,నారి రామస్వామి,తోర్పునూరి శంకరయ్య,కొమ్మగాని అంజయ్య వరికుప్పల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయి క్రీడా ఉత్సవాలు ప్రారంభం

*** క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు: ఎమ్మెల్యే గండ్ర**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి) : భూపాలపల్లి జిల్లాలో జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రీడా ఉత్సవాలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, విద్యార్థులను పరిచయం చేసుకున్న ఎమ్మెల్యే వారితో కలిసి కబడ్డీ ఆడి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. .కార్యక్రమంలో జిల్లా క్రీడా అధికారి, అధికారులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో ట్రాన్స్జెండర్లకు ప్రత్యేక అవకాశం కల్పించాలి



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ట్రాన్స్జెండర్ సమాజానికి ప్రత్యేక అవకాశం కల్పించాలని కోరుతూ సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఆ సమాజ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. ఇటీవల నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల లక్కీ డ్రాలో తమ సమాజానికి చెందిన ఒక్కరికీ కూడా ఇల్లు కేటాయించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాల ఆదరణ లేకపోవడంతో పలువురు ట్రాన్స్‌జెండర్లు సొంత ఇళ్లు లేకుండా ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తున్నారని తెలిపారు. తమ పరిస్థితిని ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని ఇందిరమ్మ ఇళ్లలో ట్రాన్స్‌జెండర్ సమాజానికి ప్రత్యేక అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు లాలస, శుభలేఖ, గంగ, పాల్వంచ మండల అధ్యక్షురాలు వెన్నెల, అపూర్వ హర్షిత, మాళవిక, లలిత తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదుకు డీ-నోవో నోటీసు

* **నవంబర్ 6లోగా ఫారమ్–18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి**



ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్: మహబూబ్నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ తెలంగాణ శాసనమండలి స్థానానికి సంబంధించి ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందించేందుకు డీనోవో ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఓటర్ల నమోదు ప్రక్రియకు సంబంధించిన అధికారిక నోటీసు, షెడ్యూల్ను షాద్నగర్ ఆర్డీఓ, సహాయ ఎన్నికల నమోదు అధికారి ఎన్.ఆర్. సరిత కార్యాలయ నోటీసు బోర్డులో ప్రదర్శించారు. 2026 నవంబర్ 1 నాటికి కనీసం మూడేళ్ల క్రితమే పట్టా పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి ఫారమ్-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుల స్వీకరణకు 2026 నవంబర్ 6ను తుది తేదీగా నిర్ణయించారు. పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితాను డీనోవో పద్ధతిలో కొత్తగా రూపొందిస్తున్నందున గతంలో ఓటరుగా నమోదైన పట్టభద్రులు సైతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.అర్హత కలిగిన పట్టభద్రులు ఆన్లైన్లో ఎన్నికల శాఖ అధికారిక వెబ్సైట్ ద్వారా లేదా సంబంధిత సహాయ ఎన్నికల నమోదు అధికారి, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫారమ్-18 సమర్పించవచ్చు. దరఖాస్తుతో పాటు డిగ్రీ, డిప్లొమా ధ్రువపత్రం లేదా మార్కుల పట్టిక వంటి విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఈ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో మహబూబ్నగర్, నాగర్కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నారాయణపేట, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్గిరి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాలు ఉన్నాయి.ఒక వ్యక్తి లేదా సంస్థ పెద్ద సంఖ్యలో దరఖాస్తులను సమూహంగా సమర్పించే విధానం చెల్లదని అధికారులు స్పష్టం చేశారు. అయితే కుటుంబ సభ్యుల దరఖాస్తులను మరొక కుటుంబ సభ్యుడు సంబంధిత అసలు ధ్రువపత్రాలను చూపించి సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తులో తప్పుడు సమాచారం ఇస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 31 ప్రకారం చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని ఓటర్ల జాబితాలో తన పేరును నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.

ఓటు హక్కును కాపాడాలి.. రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

* **సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): ఓటు హక్కు పరిరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై ఎన్నికల ప్రక్రియలో అవకతవకలపై నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల వ్యవస్థపై వస్తున్న ఆరోపణలకు ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఆ హక్కును కాపాడాల్సిన ఎన్నికల వ్యవస్థే అనుమానాలకు తావిచ్చేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, బిహార్ తదితర రాష్ట్రాల్లో ఫారం 6ఏ సహా ఎన్నికల ప్రక్రియను దుర్వినియోగం చేస్తూ లక్షలాది మంది ఓటర్లను జాబితాల నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.ప్రజల ఓటు హక్కును హరించే ప్రయత్నాలను కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదని, ప్రజల తరపున పోరాడుతుందని గండ్ర స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై వస్తున్న అనుమానాలు, ఆరోపణలపై ఎన్నికల సంఘ ప్రజలకు పారదర్శకంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం అధికారులు ప్రజాస్వామ్య విలువలను కాపాడే విధంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, మున్సిపల్ చైర్మన్ కొమురయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్, మధు, రాజేందర్, దేవన్, కిషన్, భువనసుందర్, రాజు, అన్ని మండలాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేసిన ఉద్యమకారులకు ధన్యవాదాలు



పలిగొండ, ప్రజాస్ఫూర్తి:ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు రాష్ట్ర నలుమూలల నుండి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఉద్యమకారునికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని ఆయన కోరారు.

కబ్జాకు గురైన అల్లం వారి కుంటను కాపాడాలని కలెక్టర్ కు వినతి

విచారణ జరపాలని అడిషనల్ కలెక్టర్ కు ఆదేశం



ప్రజాస్ఫూర్తి ,జన్నారం:జన్నారం మండలంలోని రేండ్లగూడ గ్రామ శివారులో సర్వే నెంబర్ 160,161 లో ఉన్న 24 ఎకరాల అల్లం వారి కుంట కబ్జాకు గురైందని రేండ్లగూడ గ్రామ సామాజిక కార్యకర్త సముద్రాల శంకర్, సిపిఐ మండల కార్యదర్శి దాసరి తిరుపతి, ఆకుల మధు, బాల్తా సుధాకర్, అల్లం సురేష్ లు సోమవారం రోజున మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్ కు ఫిర్యాదు అందజేశారు. కబ్జాకు గురైన అల్లం వారి కుంట ను పరిరక్షించాలని, కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని,కుంట ను కబ్జా చేయడం వలన రైతులు,ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని గత ఆరు రోజుల నుండి రిలే నిరాహార దీక్ష చేస్తున్నామని కాపున అట్టి కుంటపై సర్వే చేసి న్యాయం చేయాలని కోరారు.సానుకూలంగా స్పందించిన కలెక్టర్ కుమార్ దీపక్ రేండ్ల గూడ గ్రామానికి వెళ్లి సర్వే చేసి వెంటనే నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ రాములు ను ఆదేశించారు.

వేరి ధాన్యం కొనుగోలు సాఫీగా పూర్తి చేయాలి

* **జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజాస్ఫూర్తి, ఖైంసా:వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం నిజామాబాద్ కలెక్టరేట్ లో నిర్మల్ జిల్లా కు సంబంధించి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఖరీఫ్ (వానాకాలం) వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. సమయానికి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.రైతులకు ఇబ్బందులు కలుగకుండా తగిన వసతులు కల్పించాలని పేర్కొన్నారు. కొనుగోలుకు సంబంధించిన సామగ్రి అంతా సమకూర్చుకోవాలన్నారు. రైతులకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలుగకూడదన్నారు. శాఖల మధ్య సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు జీవితమే ముద్దు

* **జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు నశా ముక్త్ యువ భారత్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలను తెలిపారు.దేశాన్ని మాదకద్రవ్యాల (డ్రగ్స్) రహితంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జాతీయ ఉద్యమమే “నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్”. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2026 ఆగస్టు 2న ప్రారంభించారు. అభివృద్ధి చెందిన భారతదేశం (వికసిత్ భారత్) లక్ష్య సాధనలో యువతను భాగస్వాములను చేయడం, వారిని వ్యసనాలకు దూరంగా ఉంచడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. క్రమశిక్షణ అభివృద్ధికి నిచ్చెన మెట్టని, చదువే విద్యార్థికి ముఖ్య ఉద్దేశ్యంగా వుండాలని, చెడు అలవాట్లకు, చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు దూరంగా వుండాలని, తల్లిదండ్రులు పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకొని, తినీతినక, పస్థులుండి, అప్పులు చేసి చదివిస్తున్నారని, విద్యార్థులు మంచి క్రమశిక్షణతో వుండి వున్నత చదువులు చదవాలని, డ్రగ్స్,మత్తు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడవద్దని, మంచి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని, ఒక్కసారి డ్రగ్స్ కు అలవాటు పడితే పూర్తిగా దానికి బానిసలై పోతారని, శారీరకంగా,మానసికంగా,ఆర్థికంగా, సామాజికంగా చాలా నష్టపోతారన్నారు. విద్యార్థులు విలువైన జీవితాన్ని జీవించాలని, ఏది సాధించాలన్నా విద్యార్థుల యవ్వన దశే కీలకమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ తెలిపారు.చివరగా విద్యార్థులతో డ్రగ్స్కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

వెలిదండలో ముగ్గురికి సీఎం సహాయనిధి చెక్కులు



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి: గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను సోమవారం హుజూర్నగర్లోని మంత్రి కార్యాలయంలో అందజేశారు. నీటిపారుదల , పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో మంజూరైన చెక్కులను యూత్ కాంగ్రెస్ నాయకులు చెన్నగాని వెంకన్న చేతుల మీదుగా లబ్ధిదారులు అందుకున్నారు.చెక్కులు అందుకున్న వారిలో గడ్డం నాగలక్ష్మి రూ.45,500, గండు రాంబాబు రూ.60,000, వత్సవాయి త్రివేణి రూ.17,500 ఉన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా సహకరించి, చెక్కులు మంజూరు చేసిన మంత్రి నాలమద ఉత్తమ్ కుమార్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

* **టీపీసీసీ కార్యదర్శి లకావత్ లక్ష్మీనారాయణ నాయక్.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) వ్యవహార తీరు పై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శల్లో భాగం గా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రా జీనామా చేయాలని టీపీసీసీ కార్యదర్శి లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ డి మాండ్ చేశారు.సోమవారం జిల్లా కేం ద్రంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో ఆ యన మాట్లాడారు. సీఈసీ బీజేపీ కను సన్నల్లో పనిచేస్తున్నారని ఆయన ఆరో పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారా యణ నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్ర భుత్వం దేశంలోని స్వతంత్ర రాజ్యాంగ సంస్థలను బలహీనపరుస్తోందని ఆరో పించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శ కత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడు తుందని తెలిపారు. ప్రజాస్వామ్య విలు వలను కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సీఈ సీ రాజీనామా, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇం టెన్సివ్ రెవిజన్) ప్రక్రియపై వివరణ ఇవ్వాలనే డిమాండ్లతో కాంగ్రెస్ పార్టీ సె ప్టెంబర్ 28న తెలంగాణలోని జిల్లా కేం ద్రాల్లో నిరసనలు నిర్వహించింది.నమా వేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జా య మల్లేశం, మొహమ్మద్ అజహరుద్దీన్, షకీల్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

30 న రవీంద్రభారతి ముట్టడిని విజయవంతం చేయాలి



ప్రజాస్ఫూర్తి,జన్నారం:సాంస్కృతిక సారధిలో ఉద్యోగాల సాధనకై తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం వ్యవస్థాపకులు అవునోజు వెంకన్న ఆధ్వర్యంలో ఈ నెల 30 న నిర్వహించే రవీంద్ర భారతి ముట్టడి కార్యక్రమానికి పెద్ద ఎత్తున తెలంగాణ ఉద్యమ ధూంధాం కళాకారులంతా పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యమకారుల సంఘం రాష్ట్ర నాయకులు కొండుకూరి రాజు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఉద్యమ కళాకారులంతా శాంతియుతంగా ఎందరో ఎమ్మెల్యేలను, ఎంపీలను, మంత్రులను కలిసినగానీ నిమ్మకు నీరెత్తిన విధంగా వ్యవహరిస్తున్నారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిజమైన కళాకారులందరూ ఈరోజు పని పాట లేకుండా పూట గడవని స్థితిలో రోజులు గడుపుతున్నారని అన్నారు. ఉద్యోగాలు వచ్చుడాకళాకారులు చచ్చుడా అనే నినాదంతో ఈ నెల 30న చేస్తున్న రవీంద్ర భారతి ముట్టడి కార్యక్రమానికి కళాకారులంతా పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో లింగంపెల్లి రాజలింగం,సత్తయ్య,శ్రావణ్,శ్రావణి,మనోజ్ కుమార్, రాజేందర్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా, సాహితీ రంగాలలో విశిష్ట సేవ

సమ్మెట వెంకటేశ్వర్లుకు స్వర్ణ నంది పురస్కారం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: సాహితీ రంగంలో విశిష్ట సేవలందించినందుకు మహబూబాబాద్ జిల్లాకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సమ్మెట వెంకటేశ్వర్లుకు స్వర్ణ నంది పురస్కారం దక్కింది.మెగా హెల్పింగ్ హ్యాండ్స్ అండ్ మెగా ఈవెంట్స్ వారు ప్రతి సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల నుండి విద్య, సాహితీ, సాంస్కృతిక, నృత్యం, జర్నలిజం రంగాలలో కృషి చేస్తున్న వారిని ఎంపిక చేసి స్వర్ణ నంది, కీర్తి ఐకాన్ అవార్డులు ప్రదానం చేస్తుంటారు.ఈ ఏడాది 32 మందిని ఎంపిక చేయగా అందులో సమ్మెట వెంకటేశ్వర్లు ఒకరు. హైదరాబాద్ కూకట్ పల్లిలోని బిర్లా ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు గౌతం రాజు, తెలంగాణ ఫిలిం ఛాంబర్ చైర్మన్ పి.రామకృష్ణగౌడ్, రిటైర్డ్ ఎస్పీ ఎస్.ఎం. రత్న, డైరెక్టర్ వేణు, క్రీడాకారిణి జ్యోత్స్న, ఫౌండేషన్ చైర్మన్ శిరీషా రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు.

కేసీఆర్ ప్రజల గుండెల్లో ఉన్నారు: గండ్ర



భూపాలపల్లి, (ప్రజాస్ఫూర్తి): భూపాలపల్లి పట్టణంలోని ఆనంద్ థియేటర్లో ప్రదర్శితమవుతున్న ‘ది ప్యారడైజ్’ సినిమాను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి సోమవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో కలిసి ఆయన సరదాగా గడిపారు.సినిమాలో కేసీఆర్ పాత్ర తెరపై కనిపించగానే ప్రేక్షకులు, అభిమానులు పెద్దఎత్తున కేరింతలు కొట్టారు. అనంతరం గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ఫామ్హౌస్లో లేరని, ప్రజల గుండెల్లో ఉన్నారని అన్నారు. థియేటర్లో ప్రేక్షకుల స్పందనే కేసీఆర్పై ప్రజలకు ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. కేసీఆర్ పాత్రకు వచ్చిన స్పందన తెలంగాణ సమాజంతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని మరోసారి చాటిచెప్పిందన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్ బస్టాండ్లో ఆర్టీసీ బస్సు కింద పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు



హత్నూర, ప్రజా స్ఫూర్తి: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ బస్టాండ్లో సోమవారం సాయంత్రం తీవ్ర ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు ఎక్కే క్రమంలో అదుపుతప్పిన ఓ విద్యార్థిని ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడటంతో తీవ్రంగా గాయపడింది. నర్సాపూర్ మండలం కాగజ్ముద్దు గ్రామానికి చెందిన కుసంగి సంజన దౌల్తాబాద్లోని సాయి రిషి వొకేషనల్ కాలేజీలో చదువుతోంది.కళాశాల ముగిసిన అనంతరం ఇంటికి వెళ్లేందుకు బస్టాండ్కు చేరుకున్న ఆమె బస్సు ఎక్కే సమయంలో బస్సు కదలడంతో అదుపుతప్పి చక్రాల కింద పడినట్లు సమాచారం.ఈ ఘటనలో సంజన కాలుకు ఫ్రాక్చర్ కావడంతో పాటు బొటనవేలు పక్కనున్న వేలు కూడా విరిగినట్లు తోటి విద్యార్థులు తెలిపారు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బస్సును పూర్తిగా నిలపకుండానే డ్రైవర్ ముందుకు కదిలించడంతోనే ప్రమాదం జరిగిందని తోటి విద్యార్థులు,ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.ప్రమాదానికి సంబంధించిన ఆర్టీసీ బస్సును పోలీస్స్టేషన్కు తరలించి విచారణ చేపట్టినట్లు సమాచారం.

విద్యాసేవలో ఉపాధ్యాయుడి గుర్తింపు పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పలిగొండ, ప్రజాస్ఫూర్తి:జిల్లా కేంద్రంలో ట్రస్మా ఆధ్వర్యంలో విద్యా సేవ రత్న అవార్డు 2026కు పవిత్రాత్మ పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జెనీఫర్,తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎస్.పాండు ను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఆదివారం సన్మానించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ సవిత అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ టీచర్లను గుర్తించి ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ట్రస్మా వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు.అనంతరం భువనగిరి వైయస్సార్ గార్డెన్లో అస్మిత ఊషు లీగ్ పోటీలు నిర్వహించగా పాఠశాల నుండి 23మంది విద్యార్థులు పాల్గొనగా నలుగురికి గోల్డ్ మెడల్స్,ముగ్గురికి సిల్వర్ మెడల్స్,16 మంది విద్యార్థులకు బ్రోంజ్ మెడల్స్ తోపాటు ప్రశంసా పత్రాలను అందుకున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ ముందు ముందు జిల్లా,రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లి అనేక బహుమతులు పొందాలని సూచించారు.

పనులు వేగంగా.. నాణ్యతతో పూర్తి చేయాలి

*** ముధోల్ మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**



ప్రజాస్ఫూర్తి, భైంసా:నిర్మల్ జిల్లా ముధోల్ మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచులు విన్నవించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.వ్యవసాయ శాఖ పరిధిలోరైతులకు అందుతున్న సేవలు,పంటల పరిస్థితి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. రైతులకు అవసరమైన సేవలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఉద్యాన పంటల సాగు, రైతులకు అందుతున్న ప్రోత్సాహకాలు, శాఖ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్య సేవలు, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు, ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై వివరాలు తెలుసుకుని, ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.గ్రామాల్లో విద్యుత్ సరఫరా పరిస్థితి, పెండింగ్‌లో ఉన్న సమస్యలు, రైతులకు సంబంధించిన విద్యుత్ సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా పరిస్థితిపై సమీక్షిస్తూ, ఎక్కడైనా నీటి సమస్యలు ఉంటే గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.పంచాయతీరాజ్ శాఖ పరిధిలో గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి, నిర్మాణ పనుల పురోగతిపై ప్రత్యేకంగా ఆరా తీశారు. గ్రామపంచాయతీ, వీఓ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు.నిలిచిపోయిన పనులను గుర్తించి వెంటనే ప్రారంభించాలని, ప్రతి నిర్మాణ పనిలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో సాగునీటి వనరులు, నీటి లభ్యత, పెండింగ్‌లో ఉన్న పనులపై అధికారులతో చర్చించారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.మండలంలోని వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను వచ్చే సమీక్ష సమావేశం నాటికి గణనీయంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అధికారులను ఆదేశించారు. పనులు కేవలం పూర్తి చేయడమే కాకుండా నాణ్యతా ప్రమాణాలతో,ప్రజలకు ఉపయోగపడే విధంగా చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి శాఖకు సంబంధించిన పనుల పురోగతిని తదుపరి సమీక్ష సమావేశంలో పరిశీలిస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం అందేలా పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అందజేశారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ దేవస్థానం నూతన పాలకవర్గం ఎన్నిక



జనగామ,ప్రజాస్ఫూర్తి : శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం నూతన పాల కవర్గం ఎన్నికలు ప్రశాంత వాతావరణం లో విజయవంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా రామని శివు డు, ప్రధాన కార్యదర్శిగా గంగిశెట్టి మం జునాథ్, కోశాధికారిగా గట్టు రాధాకృష్ణ ఎన్నికయ్యారు.ఎన్నికల అధికారులుగా మిర్యాల రమేష్,తమ్మిశెట్టి మల్లికార్జున్ వ్యవహరించి ఎన్నికల ప్రక్రియను సజా వుగా నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు తమ పై నమ్మకం ఉంచి ఎన్నుకున్న దేవస్థానం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.దేవస్థానం అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌక ర్యాల కల్పనకు, ఆలయ ఆధ్యాత్మిక కార్యక్రమాలను మరింత ఘనంగా నిర్వ హించేందుకు అందరి సహకారంతో కృషి చేస్తామని నూతన పాలకవర్గ సభ్యు లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు స హకరించిన దేవస్థానం సభ్యులు,ఎన్నిక ల కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలి పారు.

సర్ అక్రమాలు, అవకతవకలపై కాంగ్రెస్ నిరసన



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఏఐసీసీ పిలుపు, పీసీసీ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష ధోరణి, సర్ ప్రక్రియలో జరిగిన అక్రమాలు, అవకతవకలను నిరసిస్తూ డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్ ప్రక్రియలో ఓటర్ల హక్కులకు సంబంధించిన అంశాలపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు.

రద్దు చేసిన హైదరాబాద్ బస్ సర్వీసులను పునరుద్ధరించాలి



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : రద్దు చేసిన హైదరాబాద్ బస్సులను పునరుద్ధరించాలని కోరుతూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డిపో ముందు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎజె రమేష్ పాల్గొని ఆయన మాట్లాడుతూ గత 20 రోజుల నుండి కొత్తగూడెం నుండి హైదరాబాదుకు వెళ్లాల్సిన నాలుగు సూపర్ లగ్జరీ బస్సులు రెండు ఎక్స్ప్రెస్ సర్వీసులను రద్దు చేశారని దీనివలన ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మణుగూరు భద్రాచలం నుండి వచ్చే బస్సులపై ఆధారపడి హైదరాబాద్ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు . అనంతరం డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి కి వినతి పత్రం అందజేశారు .ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు , జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ ,టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ లక్ష్మి నాయకులు కాళంగి హరికృష్ణ, లింగయ్య, జలాల్,బాలకృష్ణ,రాములు,రఘు, నసూర్, శారద తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలి



ప్రజాస్ఫూర్తి, భైంసా:కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ, ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు యువనాయకులు ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ భోజ్జు పటేల్, ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గడ్డి గారి విఠల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఉత్తంభాలేరావ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి ఫరూక్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సాగరబాయి రాజన్న, భైంసా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిందే గజానంద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

*** జిల్లా ఇంచార్జీ కలెక్టర్ భాస్కర్ రావు**

భువనగిరి, ప్రజాస్ఫూర్తి :కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ కలెక్టర్ భాస్కర్ రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 83 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చినదరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు.అందులో రెవిన్యూ శాఖ 53, సర్వే ల్యాండ్స్ 9,డి ఆర్ డిఎ 5,మున్సిపాలిటీ 5 సివిల్ సప్లై 2, వ్యవసాయ, ఇరిగేషన్, ఉపాధి కల్పన, వైద్య ఆరోగ్య, ఎక్సజ్, మత్య, యం పి డి ఓ, హోసింగ్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు.

అంగన్‌వాడీలకు కేంద్రం అండ

*** అత్వెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బీజేపీ నాయకుల పర్యటన**



మేడ్చల్ (ప్రజాస్ఫూర్తి) : మహిళలు, బాలింతలు,చిన్నారుల ఆరోగ్యం,పోషణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థకు ప్రాధాన్యత ఇస్తోందని మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ అన్నారు. సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా సోమవారం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా జల్లి శైలజ హరినాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ్ అభియాన్, పోషణ్ 2.0 కార్యక్రమాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ పోషకాహార లోపాన్ని నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సక్షమ్ అంగన్‌వాడీ పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, పారిశుధ్యం, స్మార్ట్ పరికరాలు వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ఆధునీకరిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ తీరును పరిశీలించారు. కేంద్రంలోని మౌలిక వసతులు, ఇతర సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.క్షేత్రస్థాయిలో అంకితభావంతో సేవలందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపి వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ కోశాధికారి లవంగ శ్రీకాంత్, మేడ్చల్ రూరల్ జిల్లా మహిళా మోర్చా అధికార ప్రతినిధి కృష్ణప్రియ మల్లారెడ్డి, మేడ్చల్ మహిళా మోర్చా నాయకురాలు తోట అనిత, నాయకులు మహేష్ గౌలికర్, జకట బాబు రాజు తదితరులు పాల్గొన్నారు.

గిర్మాపూర్‌లో నీటి సమస్యకు పరిష్కారం చూపాలి

*** స్థానిక వాటర్‌మ్యాన్‌ను నియమించాలని డిప్యూటీ కమిషనర్‌కు వినతి**



మేడ్చల్ (ప్రజాస్ఫూర్తి) : మేడ్చల్ డివిజన్ పరిధిలోని గిర్మాపూర్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గిర్మాపూర్‌లో వాటర్‌మ్యాన్ శ్రీరాములు మృతి చెందడంతో గత నెల రోజులుగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఈ సమస్యపై మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుధాంశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గిర్మాపూర్ ప్రాంతానికి చెందిన స్థానిక వ్యక్తినే వాటర్‌మ్యాన్‌గా నియమించాలని కోరారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారిని నియమించడం వల్ల గిర్మాపూర్‌లోని నీటి సరఫరా వ్యవస్థపై పూర్తి అవగాహన లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్థానిక వాటర్‌మ్యాన్‌ను వెంటనే నియమించి, గిర్మాపూర్‌లో నిరంతర నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు కొండం ఆంజనేయులు ముదిరాజ్, బీజేవైఎం జిల్లా నాయకులు రాఘవ రెడ్డి, డివిజన్ కిసాన్ మోర్చా అధ్యక్షులు చీర్ల సత్యనారాయణ, డివిజన్ బీజేపీ కార్యదర్శి బండి విష్ణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద రక్తదాన శిబిరం విజయవంతం

*** మండలవైద్యధికారి సాయికుమార్**



కుసుమంచి, ప్రజా స్ఫూర్తి : కుసుమంచిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పీహెచ్సీలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరం విజయవంతం అయినట్లు మండల వైద్యాధికారి సాయికుమార్ తెలిపారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా ఖమ్మం జిజిహెచ్ బ్లడ్ బ్యాంక్ సిఏఎస్, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీకాంత్ హాజరై ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ బృందం పాల్గొని సహకారం అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కుసుమంచి పీహెచ్సీ సిబ్బంది అందరూ కలిసికట్టుగా ఈ శిబిరాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ తమవంతుగా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమం విజయవంతం కావడంలో ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల సహకారం మరువలేనిది అన్నారు. ఈ శిబిరంలో మొత్తం 60 మంది స్వచ్ఛంద రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. సేకరించిన ప్రతి యూనిట్ రక్తం ముగ్గురు రోగులకు ఉపయోగపడే అవకాశం ఉందని, దీనివల్ల ప్రాణాలను రక్షించడంలో అవసరమైన రోగులకు సహాయం చేయడంలో స్వచ్ఛంద రక్తదానం ఎంతో విలువైన పాత్ర పోషిస్తుందన్నారు. రక్తదాతల అమూల్యమైన సహకారానికి కృతజ్ఞతగా వారందరినీ సత్కరించి, రక్తదాన ధృవీకరణ పత్రాలను (సర్టిఫికెట్లు) అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పలు గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కుసుమంచి వైద్యాధికారి, కేజీబీవీ ప్రిన్సిపాల్, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. సమాజంలో రక్తదానం పట్ల అవగాహన కల్పించడానికి రక్తం అవసరమైన రోగులను ఆదుకోవడానికి భవిష్యత్తులో కూడా ఇలాంటి స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాలను కొనసాగిస్తామని కుసుమంచి పీహెచ్సీ తరఫున వైద్యాధికారి తెలిపారు.

ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ని కలిసిన నూతన పిఎసిఎస్ పాలకవర్గం



చౌటుప్పల్,ప్రజాస్ఫూర్తి: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని నూతనంగా ఎన్నికైన చౌటుప్పల్ సింగిల్ విండో పాలకవర్గం సోమవారం మునుగోడులో మర్యాదపూర్వకంగా కలిశారు.చౌటుప్పల్ పిఎసిఎస్ చైర్మన్ ఈడ్ల మస్తాన్ బాబు, వైస్ చైర్మన్ పర్నె శివారెడ్డిలు తమను ఎన్నిక చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి, ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ, పదవులను బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమములో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనా రెడ్డి, సంఘ పాలక వర్గ సభ్యులు బొబ్బిల్ల రాజేందర్, సుర్కంటి లక్ష్మమ్మ, జక్కిడి వెంకటరెడ్డి , రావుల స్వామి, ఎర్ర పెంటయ్య, మల్కాపురం సుగుణమ్మ, మేకల దేవేందర్ రెడ్డి, పానుగోతు లచ్చిరాం, బత్తుల శ్రీహరి, నాయకులు మొగుదాల రమేష్ గౌడ్, బోయ దేవేందర్, కాసర్ల శ్రీనివాసరెడ్డి, చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, చెన్నగొని అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ గరిడేపల్లి మండల అధ్యక్షులుగా బుడిగ చక్రవర్తి



గరిడేపల్లి ,ప్రజాస్ఫూర్తి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలో సూర్యాపేట జిల్లా ఎంఎస్ఎఫ్ ఇంచార్జ్ పందిటి నవీన్ కుమార్ మాదిగ ఆధ్వర్యంలో ఎంఎస్ఎఫ్ మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గరిడేపల్లి మండల ఎంఆర్పీఎస్ అధ్యక్షులు కొత్తపల్లి రవిమాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గరిడేపల్లి మండల ఎంఎస్ఎఫ్ అధ్యక్షులుగా బుడిగ చక్రవర్తిని ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా ఇన్చార్జి మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలను సారం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న యూనివర్సిటీలు,డిగ్రీ కాలేజీలు, జూనియర్ కాలేజీలు మరి వివిధ విద్యాసంస్థలలో మాదిగ స్టూడెంట్స్ పడుతున్న ఇబ్బందులు గుర్తించి ఫీజు రియంబర్స్మెంట్ గాని, హాస్టల్ వసతిలో ఉండే సౌకర్యాలు కానీ, విదేశీ విద్యలో కానీ,విద్యకు సంబంధించి ఇంకా వివిధ రకాల లోపాన్ని గుర్తించి, మాదిగ జాతికి ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రతి ఒక్కరిని చదువుకునే విధంగా ఎడ్యుకేట్ చేయడం, వారి హక్కులను పొందే విధంగా చూడాలని నేటి సమాజంలో విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఆ ప్రకారం సూర్యాపేట జిల్లాలో కూడా కమిటీలు వేస్తున్నామని వారు మీడియా కుతెలిపారు. ఇట్టి కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి నకిరేకంటి రవిమాదిగ, ఉపధ్యక్షులు దూరే వినోద్ మాదిగ, మండల ప్రధాన కార్యదర్శి బరిగల సతీష్ మాదిగ, కోశాధికారి ఆలంపల్లి శేఖర్ మాదిగ, రాయినిగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు తిమోతి రాజు, మాచర్ల కనకయ్య, మచ్చ గురేష్, మాచర్ల నాగార్జున, మచ్చ సురేష్, పిట్ట వెంకటేష్, మచ్చ నాగార్జున,మచ్చ విష్ణు, వట్టెపు మధు,సతీష్, మచ్చ ఆదాం మొదలైన వారు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ కు సైబర్ క్రైమ్ పై అవగాహన



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ కాలనీ లోగల సీనియర్ సిటిజన్స్ కార్యాలయం నందు సీనియర్ సిటిజన్స్ వారోత్సవాలలో భాగంగా సంఘ అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు అధ్యక్షతన పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు సైబర్ క్రైమ్ ఎస్ఐ ఎస్ కె జుబేదాబేగం వారికి అవగాహన కల్పించారు . ఈ కార్యక్రమంలో సంఘ సెక్రటరీ సురేష్ కుమార్ ,సభ్యులు రాజేంద్రప్రసాద్, గురుమూర్తి, పాండురంగారావు ,అంజనానందం, జోసెఫ్, ప్రవీణ్ కుమార్ , కేశవరావు , ప్రేమ సాగర్ , సామ్యూల్,ఇతర సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నుండి బాబూ ప్రసాద్, డాక్టర్ బత్తుల కృష్ణయ్య, ఇతర సంఘాల ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

జ్ఞానేష్ కుమార్ దిష్టి బొమ్మ దహనం

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:ఓట్ల చోరీకి సంబంధించిన ఆరోపణలపై ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేసి, సమగ్ర విచారణ జరిపించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీజేపీ అనుకూల ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ ఓట్ల చోరీకి సంబంధించిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ఓటర్ల హక్కులకు భంగం కలిగించే ఎలాంటి చర్యలైనా ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఓట్ల వ్యవహారంపై అనుమానాలు, ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో ఎన్నికల అధికారులు, సంబంధిత దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని కోరారు.ఓట్ల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చట్టప్రకారం సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు తేలిన అనంతరం తగిన చర్యలు తీసుకోవాలని కొప్పుల వేణారెడ్డి డిమాండ్ చేశారు.కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ బైరు శైలేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు అబ్దుల్ కరీం, మాద్గుల నవీన్ , నాయకులు శనగాని రాంబాబు, కుందమల్ల శేఖర్, సాజిద్ ఖాన్, పందిరి మల్లేష్, రాపర్తి నాగరాజు, బుడిగె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు, మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

*** పోలీసులకు ఎస్పీ ఆదేశం**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:మహబూబాబాద్ రూరల్ సర్కిల్ పరిధిలోని కురవి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డా. శబరీష్ పి.ఐపీఎస్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.స్టేషన్ లోని లాక్‌అప్, ఈకాప్స్, రైటర్స్ రూమ్, సీసీటీఎన్ఎస్,ఈసమ్మోన్, టీజీకాప్ వ్యవస్థల పనితీరును,రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు,గంజాయి నేరస్థుల రికార్డులు,సీసీటీవీ సర్వైలెన్స్, సీజ్ వాహనాలు,పెండింగ్ కేసులను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది యూనిఫాం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని, మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.డ్రంక్ అండ్ డ్రైవ్, గుడుంబా, గంజాయిపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని సూచించారు.

భగత్ సింగ్ ఆశయాలే యువతకు స్ఫూర్తి

*** ఆప్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్**



ప్రజాస్ఫూర్తి.భైంసా: నిర్మల్ పట్టణ కేంద్రంలో భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా సయ్యద్ హైదర్ మాట్లాడుతూ.. భగత్ సింగ్ కేవలం ఒక వ్యక్తి కాదని, ఆయన ఒక విప్లవ స్ఫూర్తి అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. అన్యాయంపై పోరాడటం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయడమే భగత్ సింగ్‌కు మనం అర్పించే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆప్ జిల్లా జనరల్ సెక్రటరీ సీ.హెచ్. వినోద్ కుమార్, ట్రెజరర్ అబ్దుల్ సాధిక్, వైస్ ప్రెసిడెంట్ బైండ్ల శ్రీనివాస్, నియోజకవర్గ ఇంచార్జి మెరుగు రాజన్న, టౌన్ వైస్ ప్రెసిడెంట్ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చు

*** సిరిపురం రైతు వేదికలో ఎన్.ఎం.ఎన్. ఎఫ్ పథకంపై అవగాహన సమావేశం**



లింగాల ఘణపురం/జనగామ, ప్రజా స్ఫూర్తి : ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించడం ద్వారా సాగు ఖ ర్చులను తగ్గించడంతో పాటు నేల ఆరో గ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్య త ఇవ్వవచ్చని మండల వ్యవసాయ అ ధికారి నజీరుద్దీన్ తెలిపారు. లింగాల ఘణపురం మండలం సిరిపురం రైతు వేదికలో సోమవారం (నేషనల్ మిషన్ ఆన్ నేచరల్ ఫార్మింగ్) పథకంపై రైతు లకు అవగాహన సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా నజీరుద్దీన్ మా ట్లాడుతూ ఎన్.ఎం.ఎన్.ఎఫ్ పథకం ద్వారా ప్రకృతి వ్యవసాయ విధానాల ను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రసా యనాల వినియోగాన్ని తగ్గించి, సహజ పద్ధతులతో సాగు చేయడం వల్ల నేల సారాన్ని కాపాడుకోవచ్చని వివరించా రు. ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఇన్‌స్పెక్టర్ హ రీష్ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ధృవీకరణ పొందే విధానం, పాటించా ల్సిన నిబంధనలు, సర్టిఫికేషన్ ప్రాము ఖ్యతపై రైతులకు అవగాహన కల్పించా రు. అనంతరం రైతులు ఎన్.ఎం.ఎన్. ఎఫ్ పథకం, ప్రకృతి వ్యవసాయ విధా నాలకు సంబంధించి తమ సందేహాల ను అధికారులను అడిగి నివృత్తి చేసు కున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రత్యూష, కృషి సఖి కల్పన, సర్టిఫికేషన్ ఇన్‌స్పెక్టర్ హరీష్, రైతులు పాల్గొన్నారు.

రేబీస్ వ్యాధి పై అవగాహన అవసరం

నల్గొండ, ప్రజాస్ఫూర్తి :ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భం గా జంతు హింస నివారణ సంఘం నల్గొండ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిహించారు .ఈ కార్యక్రమం కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రేబీస్ అనేది ప్రధానంగా సోకిన కుక్కలు , ఇతర జంతువుల కాటు, గీతలు లేదా లాలాజలం ద్వారా మనుషులకు సంక్రమించే ప్రాణాంతక వైరల్ వ్యాధి. అయితే, సమయానికి తగిన వైద్య చికిత్స జంతువులకు క్రమం తప్పకుండా యాంటీరేబిస్ టీకాలు వేయడం ద్వారా రేబీస్‌ను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు.జంతువు కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు , ప్రవహించే నీటితో కనీసం 15 నిమిషాల పాటు శుభ్రంగా కడగాలి. అనంతరం ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి/ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్యుల సూచన మేరకు యాంటీ రేబిస్ టీకాలు అవసరమైన చికిత్స తీసుకోవాలన్నారు.ప్రజలు తమ ఇళ్లలోని కుక్కలు, పిల్లులు ఇతర పెంపుడు జంతువులకు నిర్దిష్ట కాల వ్యవధిలో యాంటీరేబిస్ టీకాలు వేయించడంతో పాటు, వాటిని బాధ్యతాయుతంగా సంరక్షించాలని అధికారులు కోరారు. వీధి కుక్కల పట్ల కూడా జంతు సంక్షేమ నిబంధనలకు అనుగుణంగా బాధ్యతాయుతమైన నియంత్రణ, టీకాలు మరియు స్టెరిలైజేషన్ చర్యలు చేపట్టడం ద్వారా రేబీస్ నియంత్రణకు సహకరించాలని సూచించారు.పిల్లలు ముఖ్యంగా తెలియని కుక్కలు లేదా ఇతర జంతువులను ఆటపట్టించకుండా, వాటిని అనుమతి లేకుండా తాకకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.“రేబీస్‌ను నివారించవచ్చు - ప్రతి జంతువుకు టీకా, ప్రతి కాటుకు తక్షణ చికిత్స” అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చింది.ప్రజలు అపోహలను నమ్మకుండా, జంతువుల కాటు లేదా గీతలు సంభవించినప్పుడు వెంటనే వైద్య సలహా తీసుకోవాలని, రేబీస్ నివారణలో పశుసంవర్ధక శాఖ మరియు వైద్య ఆరోగ్య శాఖలకు సహకరించాలని కోరారు.

ఇళ్ల పట్టాలు, మౌలిక వసతులు కల్పించాలి : మోకు కనకరెడ్డి

*** కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా.. పోలీసులతో తోపులాట, అరెస్టులు**



జనగామ, ప్రజాస్ఫూర్తి : మూడో విడత ఇందిరమ్మ ఇళ్ల స్థలాల్లో నివాసం ఉం టు న్న పేదలకు ఇంటి నంబర్లు కేటా యించి మౌలిక వసతులు కల్పించాల ని, ఆ స్థలాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివసిస్తున్న 72 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని డి మాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సో మవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాకు పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్ష త వహించారు.జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మా ట్లాడారు. ఈ సందర్భంగా కనకరెడ్డి మా ట్లాడుతూ 2012-13లో అప్పటి ప్రభు త్వం ఇల్లు లేని పేదలను గుర్తించి 1,14 4 మందికి ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పట్టా లు ఇచ్చిందన్నారు.అయితే మౌలిక వసతులు, గృహ రుణాలు అందకపోవ డంతో పలువురు ఇళ్లు నిర్మించుకోలేక పోయారని తెలిపారు.అనంతరం డబు ల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం స్థలా లు కేటాయించి, ఆర్థిక స్థోమత లేని 72 మంది పేదలకు 2023 జూలై లో డ్రా ద్వారా ఇళ్లు కేటాయించినట్లు పేర్కొ న్నారు. ఇందిరమ్మ ఇళ్ల స్థలాల్లో పేదలు తమ శక్తిమేరకు నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించి విద్యుత్, తాగునీరు, సీసీ రోడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చే శారు.కలెక్టరేట్ ఎదుట సుమారు నాలుగు గం టల పాటు ధర్నా కొనసాగింది. ఈ సం దర్భంగా పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పో లీసులు పలువురు సీపీఎం నాయకు లు, లబ్ధిదారులను అదుపులోకి తీసు కుని బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌కు తర లించారు. పోలీసుల చర్యలను సీపీఎం నాయకులు ఖండించారు. కార్యక్రమం లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్య లు ఇర్రి బోట్ల శేఖర్, బూడిది గోపి, సుం చు విజేందర్, పోత్కనూరి ఉపేందర్, ఎండీ అజారుద్దీన్, మూడో వార్డు కౌన్సి లర్ బూడిది జ్యోతి, మూడో విడత ఇం దిరమ్మ లబ్ధిదారుల అధ్యక్షుడు కళ్యా ణం లింగం, పట్టణ కమిటీ సభ్యులు శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

*** కలెక్టర్ కె.హరిత**



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి :ప్రజావాణి కార్యక్రమంలో అందే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ట్రైనీ కలెక్టర్ జోస్టిన్ జోల్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.దహెగాం మండలం రనవెల్లి గ్రామానికి చెందిన కోలే స్వర్ణలత తన భర్త మృతిచెందడంతో ఆయన పేరిట ఉన్న భూమిని తన పిల్లల పేరిట పట్టా మార్చాలని కోరారు. ఆసిఫాబాద్ మండలం జన్కపూర్‌కు చెందిన కుమారస్వామి గ్రామంలో రోడ్డు ఆక్రమణ, బతుకమ్మ గద్దె కూల్చివేత, స్థల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరారు. జైనూర్ మండలం మాణిక్‌గూడకు చెందిన జాదవ్ లలితభాయి తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.లింగాపూర్ మండలం పీర్లతండా సర్పంచ్ భానోత్ కృష్ణ, ఉపసర్పంచ్ బోడ సీత వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా, వారి ఆమోదం లేకుండా ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ చర్యలు తీసుకోవాలని కోరారు. చింతలమానపల్లి మండలం రుద్రపూర్‌కు చెందిన కల్పన తన పేరుతో ఉన్న భూమి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. ఆసిఫాబాద్ మండలం చిలాటిగూడకు చెందిన బొమ్మరే మహేష్ తాను దివ్యాంగుడినని, నిత్యావసరాల కోసం రాకపోకలకు ఈ బైక్ మంజూరు చేయాలని కోరారు.

*** పెట్రోల్ పోసుకునేందుకు యత్నం**

చోర్‌పల్లి గ్రామానికి చెందిన మిట్ట మల్లయ్య కలెక్టరేట్ ఎదుట పెట్రోల్ పోసుకునేందుకు యత్నించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తన కుమార్తె గోలెం సమత పేరిట ఉన్న భూమిని తన పేరునకు మార్చాలని ఆయన ప్రజావాణిలో దరఖాస్తు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ వ్యవహారం సివిల్ వివాదంతో పాటు ఏజెన్సీ కోర్టు పరిధిలో ఉందని పేర్కొన్నారు. 2020లో గోలెం సమత ఏజెన్సీ కోర్టులో కేసు దాఖలు చేసినందున అక్కడే సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. మిట్ట మల్లయ్య 2024 జూన్‌లో తన కుమార్తె, కుమారుడి పేరిట భూమిని పార్టిషన్‌గా బదలాయించినట్లు తెలిపారు. ఈ కేసు అక్టోబర్ 3న ఏజెన్సీ కోర్టులో విచారణకు రానున్నట్లు వెల్లడించారు.ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కె.హరిత తెలిపారు.కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నేల సారం పెరుగుతుంది

*** కేవీకే–గడ్డిపల్లిలో రైతులకు శిక్షణ కార్యక్రమం**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: సూర్యాపేట జిల్లా వ్యవసాయ శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ), హుజూర్‌నగర్ డివిజన్ ఆధ్వర్యంలో రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్ (RPL) కార్యక్రమంలో భాగంగా కేవీకే-గడ్డిపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేవీకే-గడ్డిపల్లి సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ ఇన్‌చార్జి డి. నరేష్ ఆధ్వర్యం వహించారు.ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త సి.హెచ్. నరేష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కూరగాయలను సాగు చేసే విధానాలు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.శాస్త్రవేత్త ఎ. కిరణ్ మాట్లాడుతూ భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే వివిధ ద్రావణాలు, కషాయాల తయారీ విధానం, వాటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు.అలాగే సమగ్ర వ్యవసాయ విధానాల ప్రాముఖ్యతను వివరించారు.శిక్షణలో భాగంగా వివిధ పంటలకు ఉపయోగించే ద్రావణాలు, కషాయాలను రైతుల చేత స్వయంగా తయారు చేయించి, వాటిని పంటల్లో వినియోగించే విధానంపై ప్రాయోగిక శిక్షణ అందించారు. దీంతో రైతులు ప్రకృతి వ్యవసాయంలో అవసరమైన ద్రావణాలను స్వయంగా తయారు చేసుకునే విధానాన్ని నేర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో డీపీడీ (ఎటీఎంఏ) జి. నివేదిత, ఎడీఏ ఆర్. రవి, కేవీకే శాస్త్రవేత్తలు డి. నరేష్, సి.హెచ్. నరేష్, ఎ. కిరణ్, డాక్టర్ పి. అక్షిత్ సాయి, ఏఈవోలు ఎం. రమ్య, రియాజ్, డి. మనోజ్ తో పాటు సుమారు 30 మంది రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పాటల పోటీలో ప్రజ్ఞకు తృతీయ స్థానం



భూపాలపల్లి, (ప్రజాస్ఫూర్తి):ప్రపంచ ప ర్యా ట క ది నో త్స వా న్ని పురస్కరించుకుని నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన, షార్ట్ వీడియో, పాటల పోటీల్లో భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని కమ్మల ప్రజ్ఞ పాటల విభాగంలో తృతీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రజ్ఞను అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 15న జరిగిన మండల స్థాయి, 22న జరిగిన జిల్లా స్థాయి పాటల పోటీల్లో ప్రజ్ఞ ప్రథమ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ నెల 26న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తృతీయ స్థానం సాధించి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుందని తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, చదువుతో పాటు క్రీడలు, సంగీతం, కళల్లోనూ రాణించాలని సూచించారు. ప్రజ్ఞ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

*** తండ్రి నుంచి కళా వారసత్వం**

మల్హర్‌రావు మండలం పాత రుద్రారం గ్రామానికి చెందిన కమ్మల లక్ష్మి, ప్రవీణ్‌కుమార్ దంపతుల కుమార్తె ప్రజ్ఞ. ప్రస్తుతం భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంసీపీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి ప్రవీణ్‌కుమార్ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడిగా సేవలందిస్తున్నారు. తండ్రి నుంచి కళా వారసత్వాన్ని అందిపుచ్చుకున్న ప్రజ్ఞ చిన్ననాటి నుంచే పాటలపై ఆసక్తి పెంచుకుని వివిధ పోటీల్లో ప్రతిభ చాటుతోంది. ప్రజ్ఞ సాధించిన విజయంపై కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

పౌష్టికాహారం–ఆరోగ్యకరమైన బాల్యం–బలమైన భవిష్యత్తు

*** సూర్యాపేట జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామంజి గౌడ్**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: రాయినిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ 1 కేంద్రంలో పౌష్టికాహార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్, సూర్యాపేట జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామంజి గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ఆరోగ్యకరమైన, పౌష్టికాహారాన్ని అందించారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడం, ఆరోగ్యకరమైన ఎదుగుదలను ప్రోత్సహించడం, గర్భిణీలు, బాలింతలకు అవసరమైన పోషకాలను అందించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.అంగన్వాడీ సిబ్బంది పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. పిల్లలకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. “పౌష్టికాహారం-ఆరోగ్యకరమైన బాల్యం-బలమైన భవిష్యత్తు” అనే సందేశంతో కార్యక్రమాన్ని కొనసాగించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీత, అంగన్వాడీ టీచర్లు చంద్రకళ, నాగమణి, రాయినిగూడెం డాక్టర్ సుష్మ, ఏఎన్ఎం, ఆశా వర్కర్, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూతబడిన పాఠశాలను తెరిపించి.. ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాజశేఖర్



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి:మూతబడిన పాఠశాలను తిరిగి తెరిపించి, విద్యార్థులను పాఠశాలలో చేర్పిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్న గరిడేపల్లి మండలం రేగులగడ్డ తండా పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్. రాజశేఖర్ (ఎస్జీటి) మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.రేగులగడ్డ తండా పాఠశాల మూతపడిన సమయంలో ఉపాధ్యాయుడు రాజశేఖర్ ప్రత్యేక చొరవ తీసుకుని పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు కృషి చేశారు. ప్రస్తుతం పాఠశాలలో 21 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు గురుకుల, నవోదయ ప్రవేశ పరీక్షలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక బోధన అందిస్తున్నారు.కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తూ, విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు రాజశేఖర్ చేస్తున్న కృషికి గుర్తింపుగా మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, ఎంఈఓ, తోటి ఉపాధ్యాయులు రాజశేఖర్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

4వ వార్డులో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన చైర్ పర్సన్



మహబూబాబాద్,ప్రజాస్ఫూర్తి : మ హ బూ బా బా ద్ మున్సిపాలిటీ లోని 4వ వా ర్డు గాంధీపురం,ఎన్ ఎన్ నగర్ లో రూ.17.52 లక్షలతో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది.మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు జ్యోతి రమేష్ నాయక్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.తనను అత్యధిక మెజారిటీతో గెలిపించిన వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు అభివృద్ధే తన లక్ష్యమని అన్నారు. చేస్తున్న అభివృద్ధి పనులు ఎక్సలెంట్ గా ఉన్నాయని ప్రజలు మెచ్చుకుంటున్నారని అన్నారు. రోడ్లు బ్యూటిఫుల్ గా నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యతతో రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే భూక్యా మురళీ నాయక్ సహకారంతో వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో సాదుల శ్రీనివాస్, నీరుటి లక్ష్మీనారాయణ, బొల్లు రాజు, మహమ్మద్ ఖలీల్, గాడిపెల్లి చరణ్, ధూపాటి వినయ్, నిమ్మల శ్రీనివాస్, ఎడ్ల రమేష్,రాజు, కాంగ్రెస్, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావాణి ఆర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించండి

*** ఉద్యోగులంతా ఫేస్ అటెండెన్స్ నమోదు చేయాలి. కలెక్టర్ స్నేహ శబరిష్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో,ఎంపీడీవో కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 225 అర్జీలు వచ్చాయి.జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ (రెవెన్యూ), అదనపు కలెక్టర్ పురుషోత్తం (లోకల్ బాడీస్ ఇంచార్జ్) కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీని పెండింగ్ లో ఉంచకుండా సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతో సహా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆన్ లైన్ ముఖ చిత్ర హాజరు (ఫేస్ అటెండెన్స్) లో నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. గురుకుల హాస్టల్స్, ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు కావలసిన ప్రతిపాదనలను సంక్షేమ శాఖల స్పెషల్ అధికారులు వెంటనే అందజేయాలని ఆదేశించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు కోసం పట్టభద్రులైన ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా వచ్చిన 225 అర్జీలలో కలెక్టరేట్ లో 93, ఆర్డీవో కార్యాలయాల్లో 03, ఎంపీడీవో కార్యాలయాల్లో 123 అర్జీలు వచ్చాయి.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగలక్ష్మి, డిఆర్డిఓ పీడీ మధుసూదన రాజు, డివిహెచ్ఓ డా. కిరణ్ కుమార్, ఎస్టీ సంక్షేమ అధికారి దేశీ రామ్ నాయక్, డిఎం అండ్ హెచ్ఓ డా. రవి రాథోడ్, సీపీఓ శ్రీనివాసరావు, డిహెచ్ఎస్ఓ జీ. మరియన్న, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్,అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మన కుటుంబ పెద్దలు జ్ఞానానికి, విలువలకు ప్రతిరూపాలు

– సెయింట్ మేరీస్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ నిర్మల పాలిశెట్టి

– ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు కుటుంబానికి జ్ఞానం, అనుభవం, ఆప్యాయత, విలువలకు ప్రతిరూపాలని, వారి ప్రేమలో స్వార్థం ఉండదని, వారి అనుభవాలు చిన్నారులకు జీవిత పాఠాలను నేర్పుతాయని సెయింట్ మేరీస్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ నిర్మల పొలిశెట్టి అన్నారు. కొత్తగూడెం పట్టణంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు సోమవారం ఎంతో ఆనందోత్సాహాలతో, ఆత్మీయ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు కుటుంబానికి అందించే ప్రేమ, అనుభవం, విలువలు, మార్గదర్శకత్వాన్ని గౌరవిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ నిర్మల పోలిశెట్టి మాట్లాడుతూ తరతరాలను అనుసంధానించే ఈ అమూల్యమైన బంధాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించి, కాపాడుకోవాలని సూచించారు. తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలతో కలిసి విద్యార్థులు నిర్వహించిన వివిధ కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్దలు, పిల్లలు కలిసి ఆనందాన్ని పంచుకోవడంతో పాఠశాల ప్రాంగణం ఆనందోత్సాహాలు, ఆత్మీయతతో నిండిపోయింది. అనంతరం విద్యార్థులు తమ తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మల పట్ల తమకున్న ప్రేమాభిమానాలను చాటుతూ అందమైన పాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రత్యేక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకోవడంతోపాటు, పెద్దల పట్ల వారికున్న గౌరవం, కృతజ్ఞతను ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మాధవి, సిస్టర్ లిల్లీ డానియేల్, సిస్టర్ నిర్మల కొఫూరి, ఆఫీస్ ఇన్‌చార్జి సిస్టర్ ఉషా, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు తదితరులు పాల్గొన్నారు.

కుక్క కాటుకు గురైతే వెంటనే రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలి

: డా. హరికృష్ణ

*** పట్టణ ఆరోగ్య కేంద్రంలో రేబిస్ వ్యాధి పై అవగాహన కార్యక్రమం**



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం ప ట్టణ ఆరోగ్య కేంద్రంలో రేబిస్ వ్యాధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఓ ఎన్.ని.డి డా.హ రి కృష్ణ మాట్లాడుతూ రేబిస్ వ్యాధి ప్ర ధానంగా కుక్క కాటు లేదా కుక్క నాకి న ప్రదేశంలో లాలాజలం ద్వారా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. కుక్కలు, పిల్లులు లేదా ఇతర జంతువులు కరిచి నప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వీలైనం త త్వరగా, వైద్యుల సూచన మేరకు రే బిస్ వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించా రు. కాటు వల్ల ఏర్పడిన గాయాన్ని వెం టనే సబ్బు,నీటితో శుభ్రంగా కడిగి వై ద్యులను సంప్రదించాలని తెలిపారు. రేబిస్ వ్యాధి పై ప్రజలు అవగాహన పెం చుకుని,జంతువుల కాటుకు గురైనప్పు డు తక్షణ వైద్య సహాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో డా.సిద్దార్థ రెడ్డి, డా.అనురాధ, డా. రేవతి, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ రాజబాబుతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాంరెడ్డిబావిలో పశువులకు ఏమైంది?

*** నాలుగు రోజులుగా వరుస మృతులు.. సుమారు 06 పశువులు మృతి**

గుమ్మడిదల (ప్రజాస్ఫూర్తి) : గుమ్మడిదల మండలం రాంరెడ్డిబావి గ్రామంలో గత నాలుగు రోజులుగా పాడిపశువులు వరుసగా మృతి చెందుతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.నోటిలో లాలాజలం కారడం, చెవుల నుంచి రక్తస్రావం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలతో పశువులు మృతి చెందుతున్నాయని రైతులు తెలిపారు. గ్రామానికి చెందిన పాడి రైతు సామల మోహన్‌రెడ్డికి చెందిన సుమారు 06 పశువులు మృతి చెందినట్లు సమాచారం.

1962 సేవలపై రైతుల ఆవేదన



1962 పశు వైద్య అత్యవసర సేవకు ఫోన్ చేయగా వాహనాలు అందుబాటులో లేవని సమాధానం వచ్చిందని రైతులు ఆరోపిస్తున్నారు. అత్యవసర సమయంలో సకాలంలో వైద్య సహాయం అందకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. 1962 సేవల స్పందనపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. సమాచారం అందుకున్న గుమ్మడిదల మండల వెటర్నరీ వైద్య అధికారి డాక్టర్ నరసింహారావు, తమ బృందంతో గత మూడు రోజులుగా గ్రామంలో పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. అందుబాటులో ఉన్న మందులతో చికిత్స చేస్తూ, అవసరమైన మందులను బయట నుంచి తెప్పిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.పశువుల మృతికి కారణాన్ని నిర్ధారించేందుకు రక్త నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపినట్లు తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాతే మృతికి ఖచ్చితమైన కారణం తెలుస్తుందని స్పష్టం చేశారు. గ్రామంలోని పశువులకు టీకాలు వేయడంతో పాటు అన్ని పశువుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధిత రైతును ఆదుకోవాలి

పశువుల మృతితో తీవ్రంగా నష్టపోయిన సామల మోహన్‌రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతకు కాంగ్రెస్ డిమాండ్

*** జనగామలో భారీ నిరసన ర్యాలీ.. కలెక్టర్‌కు వినతిపత్రం**



జనగామ, ప్రజాస్ఫూర్తి : కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సో మవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహిం చారు. స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడి యం శ్రీహరి, పాలకుర్తి ఎమ్మెల్యే యశ స్విని రెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు లకావ త్ ధన్వంతి, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి తదిత రులు పాల్గొన్నారు. నెహ్రూ పార్క్ నుం చి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టర్ సందీప్ కుమా ర్ ఝాకు వినతిపత్రం అందజేశారు. రా ష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో నిరసనలు నిర్వహించాలన్న టీపీసీసీ పిలుపులో ప్రధాన డిమాండ్‌గా సీఈసీ జ్ఞానేశ్ కు మార్ రాజీనామా కూడా ఉంది. ఈ సం దర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై అనుమా నాలు వ్యక్తమవుతున్నాయని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొల గించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత,ఓటర్ల హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిర క్షణ కోసం ఉద్యమాన్ని మరింత ఉధృ తం చేస్తామని తెలిపారు. ప్రత్యేక సమ గ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియకు సంబంధించి ఎన్నికల కమిషన్ వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర,జిల్లా,పట్టణ,మండల,అనుబంధ సంఘాల నాయకులు నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

చిగురుమామిడిలో ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ

*** నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు**

*** జిల్లా వ్యవసాయ అధికారి బి.చత్రు నాయక్**



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి : కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో సోమవారం మండల ప్రత్యేక అధికారి,జిల్లా వ్యవసాయ అధికారి బి.చత్రు నాయక్,ఎస్సై జగదీశ్వర్,మండల వ్యవసాయ అధికారి తాటిపెల్లి పున్నంచందర్ రెడ్డి సంయుక్తంగా ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లోని నిల్వలు, రికార్డులను వారు నిశితంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి చత్రు నాయక్ మాట్లాడుతూ మార్కెట్లో ప్రభుత్వం అనుమతించిన కంపెనీల ఎరువులను మాత్రమే డీలర్లు విక్రయించాలని,అనుమతి లేని ఇతర బ్రాండ్లు లేదా నకిలీ ఎరువులను విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులకు నమ్మకమైన, నాణ్యమైన ఎరువులు అందించాలనే ఉద్దేశంతోనే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మండలంలోని ఎరువుల దుకాణదారులందరూ అధికారుల తనిఖీలకు సహకరిస్తూ, రైతులకు మేలైన నాణ్యమైన ఎరువులు, పురుగుమందులను మాత్రమే అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రకాల వ్యవసాయ పథకాలకు అర్హత లభిస్తుందని తెలిపారు. అంతేకాకుండా,రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే వడ్ల కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయోజనం పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ ఎంతో కీలకమని జిల్లా వ్యవసాయ అధికారి వివరించారు.ఈ కార్యక్రమంలో ఎరువుల దుకాణాల నిర్వాహకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో అక్రమాలపై కాంగ్రెస్ ఆందోళన


*** ఆసిఫాబాద్‌లో భారీ ర్యాలీ.. మోదీ, అమిత్‌షా, సీఈసీ దిష్టిబొమ్మల దహనం**



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజాస్ఫూర్తి:ఓటర్ల జాబితా విషయంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఆరోపించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో పారదర్శకత పాటించాలని, ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, డేటాబేస్ నిర్వహణ, సాఫ్ట్‌వేర్ తదితర అంశాల్లో ఎన్నికల సంఘం అనుసరిస్తున్న విధానంపై పలు అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఎన్నికల సంఘంలోనే అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ వాటిని పట్టించుకోకుండా ముందుకు వెళ్లడానికి కారణాలను వెల్లడించాలని కోరారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.అనంతరం కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేశారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, టీపీసీసీ జనరల్ కార్యదర్శి దుర్గం భాస్కర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, పలువురు మార్కెట్ కమిటీ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, డీసీసీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

*** ప్రజాదివాస్‌లో 15 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**



భూపాలపల్లి,(ప్రజాస్ఫూర్తి): ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్‌లో ఆయన ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 15 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా విని, సంబంధిత సీఐలు, ఎస్ఐలతో మాట్లాడి పరిష్కారానికి అవసరమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి పైరవీలు, మూడో వ్యక్తుల ప్రమేయం లేకుండా నేరుగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కృషి చేస్తోందన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాదివాస్ ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలకు పారదర్శకమైన, సత్వర సేవలు అందించడమే జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమన్నారు.

కృష్ణజింకల అక్రమ వేట గుట్టురట్టు

తొమ్మిది మంది అదుపులోకి తీసుకున్న పోలీసులు



ప్రజాస్ఫూర్తి ,షాద్‌నగర్: మరికల్ అటవీ ప్రాంతంలో కృష్ణజింకను వేటాడి, మాంసాన్ని హైదరాబాద్‌కు తరలిస్తున్న తొమ్మిది మందిని షాద్‌నగర్ పోలీసులు, ఎస్ఓటీ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. సెప్టెంబర్ 27న రాయికల్ టోల్‌గేట్ సమీపంలో వాహన తనిఖీల సందర్భంగా నిందితులు పట్టుబడ్డారు. పోలీసుల ప్రకారం. హైదరాబాద్‌కు చెందిన ఎం.డి. హాజీముద్దీన్‌తో పాటు మరో ఎనిమిది మంది సెప్టెంబర్ 26 అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరి నారాయణపేట సమీపంలోని మరికల్ అటవీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సంచరించిన అనంతరం లైసెన్సు కలిగిన .315 రైఫిల్‌తో కృష్ణజింకను వేటాడినట్లు అధికారులు తెలిపారు. అనంతరం మాంసాన్ని ముక్కలుగా చేసి ప్యాక్ చేసి కారులో హైదరాబాద్‌కు తరలిస్తుండగా రాయికల్ టోల్‌గేట్ వద్ద పట్టుకున్నారు. భారీగా స్వాధీనం... నిందితుల నుంచి సుమారు 13 కిలోల కృష్ణజింక మాంసం, టెలిస్కోప్, సైలెన్సర్ అమర్చిన .315 రైఫిల్, 19 బుల్లెట్లు, రెండు టార్చ్‌లైట్లు, క్యానన్ కెమెరా, రెండు వాహనాలు, ఎనిమిది స్మార్ట్‌ఫోన్లు, రూ.28,590 నగదును స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లోని సెక్షన్లు 9, 39, 50, 51, 57తో పాటు ఆయుధాల చట్టంలోని సెక్షన్ 30 కింద కేసు నమోదు చేశారు. నిందితుల్లో మెకానిక్లు, సాఫ్ట్‌వేర్, ఐటీ, రియల్ ఎస్టేట్, సోలార్ రంగాలకు చెందినవారితో పాటు ఓ విద్యార్థి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

24 గంటల్లోనే ఛేదన

కమిషనర్ డా. తరుణ్ జోషి పర్యవేక్షణలో షాద్‌నగర్ పోలీసులు, ఎస్ఓటీ, అటవీశాఖ, యాంటీపోచింగ్ స్క్వాడ్ సంయుక్తంగా 24 గంటల్లో కేసును ఛేదించినట్లు అధికారులు వెల్లడించారు. వన్యప్రాణుల వేట, హత్య, అక్రమ రవాణా చట్టవిరుద్ధమని, సమాచారం ఉంటే అటవీశాఖ టోల్‌ఫ్రీ 18004255364 లేదా 04023231440కు తెలియజేయాలని కోరారు. దర్యాప్తు కొనసాగుతోంది.

సామాజిక కార్యకర్త పత్తేం శ్రీనివాస్ కు స్వర్ణనంది అవార్డు ప్రధానం

*** స్వర్ణనంది అవార్డు రావడం పట్ల పలువురు హర్షం**

చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త పత్తేం శ్రీనివాస్‌ను స్వర్ణానంది అవార్డు వరించింది.మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఈవెంట్‌లో ఫౌండేషన్ నిర్వాహకులు పి.శిరీష రెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ ఉత్తమ సామాజిక కార్యకర్త పురస్కారాన్ని అందుకున్నారు.గత 26సంవత్సరాలుగా శ్రీనివాస్ సమాజానికి చేసిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ ఘన సన్మానం చేశారు.శ్రీనివాస్ 2001లో ఎన్ఎస్ఎస్ ద్వారా శ్రమదానం,పచ్చదనం కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు హెచ్ఐవి,ఎయిడ్స్ వంటి వ్యాధులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించారు.2003లో చైతన్య యూత్ అసోసియేషన్ సభ్యుడిగా,అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి సుందరగిరి గ్రామంలోనే కాకుండా మండల,జిల్లా స్థాయిల్లో ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం నింపారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని ధూమ్ ధామ్ కళాబృందాలతో కలిసి గ్రామంలో ప్రజలు వర్జిస్తూ కల్పించారు.అలాగే లీడ్ ఇండియా ఫౌండేషన్ ద్వారా ఎంతో మంది యువతకు మార్గనిర్దేశం చేస్తూ,మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాల సాధన కోసం నేటికీ కృషి చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామ జ్యోతి కార్యక్రమంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు.ప్రతిమ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఎంతో మంది నిరుపేద రోగులకు ప్రతిమ హాస్పిటల్‌లో ఉచిత వైద్యం అందేలా శ్రీనివాస్ సహకారం అందించారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతను గుర్తించి,వారికి ప్రతిమ ఫౌండేషన్ స్కిల్ డెవలప్మెంట్ కోర్సుల ద్వారా హౌస్ వైరింగ్,బైక్ మెకానిక్, ఏసీ మెకానిక్,జేసీబీ ఆపరేటర్ వంటి సాంకేతిక రంగాలలో శిక్షణ ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పించారు. దీనితో పాటు ఆకర్ ఆశ హాస్పిటల్ శస్త్రచికిత్స విభాగంతో కలిసి గ్రహణమొర్రి,బర్నింగ్ వంటి సమస్యలతో బాధపడుతున్న ఎంతో మంది రోగులకు ఉచిత సర్జరీలు చేయించి చేయూతనిచ్చారు. శ్రీనివాస్ ప్రస్తుతం చిగురుమామిడి జనంసాక్షి రిపోర్టర్ గా పనిచేస్తున్నారు.రెండు దశాబ్దాలుగా నిరంతరాయంగా సామాజిక సేవలో కొనసాగుతున్న పత్తేం శ్రీనివాస్‌కు హెల్పింగ్ ఫౌండేషన్ పి శిరీష రెడ్డి ఆధ్వర్యంలో మెగా ఈవెంట్స్ లో ప్రథాని రామకృష్ణ గౌడ్ ఛాంబర్ ఆఫ్ చైర్మన్,రిటైర్డ్ ఐపీఎస్ రత్న,ఫిలిం యాక్టర్ గౌతమ్ రాజు ఫిలిం డైరెక్టర్ చెన్నివెల్లి మణికుమార్,విశ్వక్ సినిమా మూవీ డైరెక్టర్ వేణుల చేతుల మీదుగా స్వర్ణానంది పురస్కారం దక్కడం పట్ల మండల ప్రజలు,యువత హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నారు.



టాక్ షోలో మెగాస్టార్

మెగాస్టార్ చిరంజీవి ఓటీటీలోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు సమాచారం. దిగ్గజ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ కోసం ఓ వెరైటీ సెలిబ్రిటీ టాక్ షో చేయబోతున్నట్లు తెలిసింది. తన సినీ జీవిత విశేషాలు, కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న కష్టాలు.. పలు సూపర్ హిట్ సినిమాల తెర వెనుక ముచ్చట్లతో పాటు టాలీవుడ్ హీరోలు, హీరోయిన్లు, డైరెక్టర్లతో తనకున్న అనుబంధాన్ని ఈ షో ద్వారా చిరంజీవి స్వయంగా అభిమానులతో పంచుకోనున్నట్లు ప్రచారం జరుగుతోంది. టాలీవుడ్‌కు చెందిన పలువురు సెలిబ్రిటీలు... చిరంజీవి టాక్ షోకు గెస్ట్‌లుగా హాజరయ్యే అవకాశం ఉందని సమాచారం. బీవీఎస్ రవి షో రన్నర్‌గా వ్యవహరించచనున్న ఈ ఓటీటీ షోను చిరంజీవి కూతురు సుస్మిత కొణిదెల నిర్మించనున్నట్లు తెలిసింది. త్వరలోనే చిరంజీవి టాక్ షోపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ టాక్ షో కోసం కెరీర్‌లోనే హయ్యెస్ట్ రెమ్యూనరేషన్‌ను చిరంజీవి అందుకోబోతున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ఒక్కో సినిమాకు 70 కోట్ల వరకు పారితోషికం స్వీకరిస్తున్నారు మెగాస్టార్.

చెన్నై క్వీన్ పొలిటికల్ ఎంట్రీ ?



కోలీవుడ్ హీరోయిన్ త్రిష రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతుందంటూ తమిళ నాట చాలా కాలంగా పుకార్లు షికారు చేస్తున్నాయి. దళపతి విజయ్ టీవీకే పార్టీలో చెన్నై క్వీన్ చేరనుందంటూ ప్రచారం జరుగుతోంది. ఈ రూమర్లపై త్రిష ఇప్పటివరకు రియాక్ట్ కాలేదు. అయినా రూమర్లు మాత్రం ఆగడం లేదు. తాజాగా త్రిష పొలిటికల్ వార్తలు తమిళ నాట మరోసారి హాట్ టాపిక్‌గా మారాయి. టీవీకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గోల్డ్ రింగ్ స్కీమ్‌ను మధురైలో సీఎం విజయ్ సోమవారం ప్రారంభించారు. ఈ స్కీమ్ ప్రారంభోత్సవం సందర్భంగా మధురై వస్తోన్న విజయ్‌కి స్వాగతం పలుకుతూ టీవీకే వర్గాలతో విజయ్ అభిమానులు భారీగా పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. వీటిలో త్రిష ఫ్యాన్స్ అసోసియేషన్ పోస్టర్లు చర్చనీయాంశంగా మారాయి.





ఓటీటీలోకి రోమాంచకం

అర్జున్, యానిమల్ సినిమాల దర్శకుడు సందీప్ వంగా తెలుగులో రోమాంచకం పేరుతో ఓ చిన్న సినిమాను నిర్మించారు. సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్ కుమార్ హీరోహీరోయిన్లుగా నటించిన ఈ సినిమాకు వేణుగోపాల్ రెడ్డి దర్శకత్వం వహించారు. డేటింగ్ యాప్ కల్చర్‌కు ఓ యువ జంట ప్రేమకథను జోడించి రూపొందిన ఈ మూవీ థియేటర్లలో మిక్స్‌డ్ టాక్‌ను సొంతం చేసుకుంది. తాజాగా రోమాంచకం మూవీ అక్టోబర్ 1 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతుంది. తెలుగుతో పాటు మరో నాలుగు భాషల్లో రిలీజ్ అవుతోంది.

అజిత్ సరసన ఆషికా రంగనాథ్

కోలీవుడ్ హీరో అజిత్ సిల్వర్ స్క్రీన్‌పై కనిపించి రెండేళ్లు దాటిపోయింది. 2025లో వచ్చిన గుడ్‌బ్యాడ్ అగ్లీ తర్వాత సినిమాలకు దూరమైన అజిత్ మోటర్ రేసింగ్ పోటీలపై దృష్టిసారించారు. లాంగ్ గ్యాప్ తర్వాత ఇటీవలే డేర్ డెవిల్ పేరుతో ఓ సినిమాను అనౌన్స్ చేశారు అజిత్. ఈ సినిమాలో తొలుత కథానాయికగా శ్రీలీలను మేకర్స్ ఫైనల్ చేశారు. కానీ అజిత్, శ్రీలీల మధ్య ఏజ్ గ్యాప్‌పై ట్రోల్స్ వచ్చాయి. ఈ విమర్శల కారణంగా షూటింగ్ మొదలుకాక ముందే శ్రీలీల ఈ సినిమా నుంచి తప్పుకుంది. ఆమె స్థానంలో పూజా హెగ్డేను తీసుకోవాలని అనుకున్నారు. కానీ కుదరలేదు. చివరకు కన్నడ బ్యూటీ ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా తీసుకున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. ఆషికా రంగనాథ్‌తో పాటు మరో నాయికగా ఆండ్రియాను ఖరారు చేసినట్లు చెబుతున్నారు.



ఆస్కార్ రేసులో ఆంఖ్

2027 ఆస్కార్ అవార్డుల కోసం ఇండియా నుంచి మరాఠీ మూవీ గోంధల్‌ను ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎంపికచేసింది. గోంధల్‌తో పాటు నాగాలాండ్ మూవీ ఆంఖ్ కూడా బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో పోటీ పడే అవకాశాన్ని సొంతం చేసుకుంది. ఈ రాష్ట్రం నుంచి ఆస్కార్ ఎంట్రీని దక్కించుకున్న తొలి సినిమాగా ఆంఖ్ చరిత్రను సృష్టించింది. కొన్యాక్ భాషలో కేవలం ఐదు కోట్ల బడ్జెట్‌తో డైరెక్టర్ థేజా రియో ఈ సినిమాను తెరకెక్కించారు. కేవలం 23 రోజుల్లోనే ఆంఖ్ సినిమా షూటింగ్‌ను పూర్తిచేశారు. మతమార్పిడిల నుంచి తన జాతిని కాపాడుకోవడానికి ఓ గిరిజన తెగకు చెందిన నాయకుడు ఏం చేశాడు? అనే అంశంతో ఆంఖ్ మూవీని రూపొందించారు. ఇటీవలే ఈ సినిమా టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్లాట్‌ఫామ్ అవార్డును సొంతం చేసుకుంది. ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌తో ఆస్కార్ రేసులో నిలిచే అవకాశాన్ని దక్కించుకుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.